# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 202 | శుక్రవారం 13–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in


# 2027లో జమిలి ఎన్నికలు

- ఈ పార్లమెంటు సెషన్లోనే బిల్లు
- 13, 14 తేదీల్లో సభకు హాజరు కావాలని తమ పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ కాంగ్రెస్ లు
- ఈ తేదీల్లో జమిలి ఎన్నికల బిల్లుతో పాటు మరిన్ని కీలక బిల్లులపై చర్చ
- బిల్లు పాసైతే 2027లోనే దేశ వ్యాప్తంగా ఎన్నికలు
- విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును సిఫారసు కు అవకాశాలు
- ఆచరణ యోగ్యం కాదని కాంగ్రెస్,వ్యతిరేకిస్తున్న వామపక్షాల కూటమి




**తెలంగాణ ముచ్చట్లు, నేషనల్ బ్యూరో :**

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే జమిలి ఎన్నికల బిల్లును ప్ర వేశపెట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో 13, 14 తేదీల్లో తప్ప నిసరిగా సభకు హాజరు కావాలని తమ పార్టీ ఎంపీలకు బీజేపీ విప్ జారీ చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీ కూడా ఈ రెండు తేదీల్లో సభ్యులంతా తప్పకుండా సభకు హాజరు కావాలని విప్ జారీ చేసింది. ఈ తేదీల్లో జమిలి ఎన్నికల బిల్లుతో పాటు మరిన్ని కీలక బిల్లులు కూడా సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ రూపొందించిన నివేదిక ను రాష్ట్రపతికి మార్చిలో అందించారు. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ.. ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభు త్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విస్తృ త సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లును సిఫార్సు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంప్రదిం పులు జరపడంతోపాటు అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

**2027లో ఎన్నికలు?**

జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బిల్లు పార్లమెంటు ఉభయ సభల్లో పాసైతే 2027లో దేశ వ్యాప్తంగా ఒకే సారి పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికలు జరుగుతాయనే చర్చ ఉంది. పార్ల మెంటు, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి, వంద రోజుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహి స్తారు. జమిలి

..మిగతా 2 లో

## సంక్రాంతి నుంచి రైతు భరోసా..

- రైతు భరోసాని సంక్రాంతి నుంచి అమలుచేస్తామని ఇప్పటికే ప్రకటించాం..
- రైతులకు ఇచ్చే బోనస్ రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి..
- ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సీఎం చిట్ చిట్..

**తెలంగాణ ముచ్చట్లు,ఢిల్లీ :**

రైతు భరోసాని సంక్రాంతి నుంచి అమలుచేస్తామని.. ఇప్పటికే ప్రకటించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ఇచ్చే బోనస్ రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి రైతులకు చేకూర్చుతుందని తెలిపారు. ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సీఎం చిట్ చిట్ నిర్వహించారు. రాహుల్ గాంధీని కలవలేదని తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. హైడ్రాకి ధనికా పేద అన్న తేడా లేదని భట్టి విక్రమార్క తెలిపారు. ఎవరు చెరువులను ఆక్రమించిన వారిపై హైడ్రా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబోతున్నామని అన్నారు. రైతు భరోసాని సంక్రాంతి నుంచి అమలుచేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించామని భట్టి క్లారిటీ ఇచ్చారు. రైతులకు ఇచ్చే



బోనస్ రైతు భరోసా, రుణమాఫీ కన్నా ఎక్కువ లబ్ధి రైతులకు

..మిగతా 2 లో



## ఆర్ఆర్ఆర్‌కు ఆర్థిక అనుమతులివ్వండి

**తెలంగాణ ముచ్చట్లు,ఢిల్లీ :**

తెలంగాణలో మణిహారం రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం (159 కి.మీ.) నిర్మాణానికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేయాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో సమావేశమైన సీఎం, రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి అనుమతులు మరియు నిధుల కేటాయింపును వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎన్ఎచ్765కు బడ్జెట్ కేటాయింపు అవసరంశ్రీశైలాన్ని హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్765లో మిగిలిన 62 కి.మీ. ప్రాంతం ఆమ్రాబాద్ అటవీ భూభాగంలో ఉందని, ఈ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 202425 బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ద్వారా హైదరాబాద్‌ప్రకాశం జిల్లా మధ్య 45 కి.మీ. దూరం తగ్గుతుందని ఆయన వివరించారు.

**ముఖ్య ప్రాజెక్టులపై సీఎం సూచనలు**

- హైదరాబాద్‌విజయవాడ (ఎన్‌హెచ్65) రహదారిని ఆరు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు.
- వరంగల్ దక్షిణ భాగంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, ఛత్తీస్‌గఢ్‌ను కలిపే ఎన్‌హెచ్63ను వరంగల్ నగర వెలుపల బైపాస్ ద్వారా అనుసంధానించాలని విజ్ఞప్తి చేశారు.
- పర్వత్ మాల ప్రాజెక్టులో భాగంగా యాదాద్రి దేవాలయం, నల్గొండ హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ వద్ద రోప్ వే ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, సురేష్ షెట్కర్, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, రాయసాయం రఘురామిరెడ్డి, కడియం కావ్య, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కమిటీని సర్వేయర్లును భాగస్వామి చేసుకోవాలి

- ఇప్పటి వరకు 2లక్షల 32 వేల దరఖాస్తులను యాప్ లో నమోదు చేశాం
- ఆలస్యం అయిన అసలైన లబ్ధి దారులకు ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం
- ఇందిరమ్మ కమిటీని సర్వేయర్లును భాగస్వామి చేసుకోవాలి : మంత్రి పొంగులేటి

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ప్రజాపాలనలో అప్లై చేసి కొని వాళ్ళు కూడా ఇందిరమ్మ ఇళ్లలో అప్లై చేసేకునే అవకాశం ఉందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో 10 కొత్త అంశాలు చేర్చాము. సర్వే అధికారుల రికమండేషన్ ఆప్షన్ తీసివేశామని, ఇప్పటి వరకు 2లక్షల 32 వేల దరఖాస్తులను యాప్ లో నమోదు చేశామన్నారు. ఆలస్యం అయిన అసలైన లబ్ధి దారులకు ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐటీడీఏ, ట్రైబల్ ఏరియాలో ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయి.... ప్రత్యేక నిధులు కేటాయింపు చేస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇందిరమ్మ కమిటీని సర్వేయర్లును భాగస్వామి చేసుకోవాలని, సంక్రాంతి లోపల విఆర్ఓ వ్యవస్థ ను తీసుకొని వస్తాము. వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారికి వెనక్కి వచ్చే వాళ్ళను తీసుకుంటామన్నారు మంత్రి పొంగులేటి. తప్పు చేసిన అధికారులను కఠిన చర్యలు ఉంటాయని, ఈ అసెంబ్లీ లో ఆర్వోఆర్ చట్టం అమలు చేస్తాం...ఆర్వోఆర్ చట్టం వచ్చిన మేడ్చల్ రంగారెడ్డి అక్రమార్కుల చిట్టాను ఆధారాలతో బయట పెడుతామన్నారు. 1971లో ఉన్న మంచిని తీసుకుంటామన్నారు.ప్రధాన ప్రతి పక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..నేను వస్తారు అనుకుంటున్నా అని ఆయన అన్నారు. ఆర్వోఆర్చట్టం తెస్తున్నాము. సూచనలు చేయాలి అని కోరుకుంటున్నామన్నారు. 80 వేల పుస్తకాలు నేను, మా ముఖ్యమంత్రి, మంత్రులు ఎవరు చదవలేదని, 80వేల పుస్తకాలు చదివినా ఆయన అనుభవం ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి రావాలి అని కోరుకుంటున్నా అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్ ,హరీష్‌రావు కనీసం 5వేల పుస్తకాలు చదివినా వాళ్ళ సూచనలు



..మిగతా 2 లో



## పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

- సొంత పార్టీ నేతలపై జగ్గారెడ్డి ఆగ్రహం
- తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం
- తమకు సమాచారం ఇవ్వకుండానే ఫైనల్ చేస్తారా? అని నిలదీత
- దీపాదాస్ తెలంగాణకు పని చేస్తున్నారా? మరో రాష్ట్రానికి వెళ్లారా? అని ప్రశ్న

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని ఎవరూ పట్టించుకోరా? అని తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, దీపాదాస్ మున్షిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

..మిగతా 2 లో



## రూ.500 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు..

- ఏసీబీ కస్టడీకి ఏఈఈ నిఖేష్
- ఏఈఈ నిఖేష్ కు నాలుగు రోజుల కస్టడీ కి అనుమతి..
- చంచల్ గూడ జైల్ నుండి కస్టడీకి తీసుకున్న ఏసీబీ..
- నాంపల్లి ఏసీబీ ఆఫీస్ లో నిఖేష్ ను 4 రోజులపాటు విచారించనున్న ఏసీబీ..
- రూ.500 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు కూడబెట్టాడని ఆరోపణలు..

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

ఆదాయానికి మించిన ఆస్తుల

..మిగతా 2 లో

## జర్నలిస్ట్‌ను కొట్టింది నిజమే..

- జర్నలిస్టును కొట్టాలనుకోలేదన్న మోహన్ బాబు
- మీ ఇంట్లో ఎవరైనా దూరితే అంగీకరిస్తారా? అని ప్రశ్న
- మీడియా ప్రతినిధి తనకు తమ్ముడి లాంటివాడన్న మోహన్ బాబు
- కొట్టడం తప్పైనప్పటికీ ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలని విజ్ఞప్తి
- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న మోహన్ బాబు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

నేను మీడియా ప్రతినిధిని కొట్టిన మాట నిజమే... కానీ ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలని, అయినప్పటికీ అలా కొట్టినందుకు చింతిస్తున్నానని సినీ నటుడు మోహన్ బాబు అన్నారు. ఈ మేరకు ఆయన ఆసుపత్రి నుంచి విడుదలయ్యాక వెల్లడించారు. ఈ మేరకు 11 నిమిషాల నిడివి గల వీడియోను విడుదల చేశారు.

**జర్నలిస్టును కొట్టాలనుకోలేదు... చింతిస్తున్నా**

జర్నలిస్ట్‌ను కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. కుటుంబ సమస్యల్లో ఎవరైనా జోక్యం



..మిగతా 2 లో

## ఆర్బీఐ నివేదికతో నిజాలు బయటపడ్డాయి..

- అబద్దాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతోంది
- బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ చేసినవన్నీ దుష్ప్రచారం అని తేలిపోయింది
- తెలంగాణ దివాలా రాష్ట్రం కాదు..
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అప్పులరాష్ట్రం అని ప్రచారం చేసింది : హరీష్ రావు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

నిన్న ఆర్బీఐ ఇచ్చిన నివేదికతో నిజాలు బయటపడ్డాయి...అబద్ధాలు తేలిపోయాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష రావు అన్నారు. ఇవాళ ఆయన సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాల పునాదుల మీద ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలను ప్రచారం చేస్తూ కాలం గడుపుతుందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తే నిజం నిప్పులాంటిది నిజం నిలకడ మీద తెలుస్తుందన్నారు. పదేళ్ల మా పాలనపై కాంగ్రెస్ మంత్రులు, సీఎం రేవంత్ చేస్తున్న దుష్ప్రచారం అంతా తప్పని తేలిపోయిందని ఆయన అన్నారు. పదేళ్లలో ప్రతి రంగాన్ని కేసీఆర్ అభివృద్ధి పరిచారని RBI గణాంకాలు చెబుతున్నాయని, పదేళ్లలో తెలంగాణ అభివృద్ధి రికార్డు సృష్టించిందన్నారు హరీష్ రావు. తెలంగాణ దివాలా రాష్ట్రం కాదు దివ్యంగా వెలుగుతున్న రాష్టమని,



..మిగతా 2 లో

# జర్నలిస్ట్‌ను కొట్టింది నిజమే..

మొదటి పేజీ తరువాయి

చేసుకోవచ్చా? అని ప్రశ్నించారు. ప్రజలు, రాజకీయ నాయకులు దీనిపై ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. తన ఇంట్లోకి దూసుకొచ్చేవారు జర్నలిస్టులా? కాదా? తనకు తెలియదని వ్యాఖ్యానించారు. మీడియాను అడ్డు పెట్టుకొని తనపై దాడి జరగవచ్చని భావించాన న్నారు. జరిగిన ఘటనకు మనస్ఫూర్తిగా చింతిస్తున్న ట్లు తెలిపారు. తాను కొట్టడం తప్పే కావొచ్చు... కానీ ఏ సందర్భంలో అలా చేశానో ప్రతి ఒక్కరూ ఆలోచించా లన్నారు. మీ ఇంట్లో ఎవరైనా దూరితే... మీ ఏకాగ్రత ను భగ్నం చేస్తే అంగీకరిస్తారా?... న్యాయాధిపతులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, వ్యాపారస్తులు, మీడియా ప్రతినిధులు దీనిపై ఆలోచించాలన్నారు. నేను కొట్టిన దెబ్బ అతనికి తగిలిందన్నారు. అందుకు బాధపడుతున్నానని... ఆ మీడియా ప్రతినిధి తనకు తమ్ముడి లాంటి వాడన్నారు. మీడియా ప్రతినిధి భా ర్యాబిడ్డల గురించి తాను ఆలోచించానని... కానీ తన గురించి ఎవరూ ఆలోచించలేదన్నారు. తాను సినిమా ల్లో నటిస్తానని... నిజజీవితంలో మాత్రం నటించా ల్సిన అవసరం లేదన్నారు.మీకు టీవీలు ఉన్నాయి... మాకు టీవీలు (చానళ్లు) లేవు... రేపు నేను కూడా టీవీని పెట్టవచ్చు... అది కాదు గొప్ప... కానీ మీడియా ప్రతినిధి మనసును గాయపర్చినందుకు చింతిస్తున్నా నన్నారు. మనసును గాయపెట్టాక చింతించి లాభం ఏమిటని ఎవరైనా అడిగితే ఇక నేనేం చేయను... మీరు చేసిందేమిటని ప్రశ్నించారు. మళ్లీ మళ్లీ చెబుతున్నా ను... అసలు అతను నిజంగా జర్నలిస్టా? కాదా? అని



నాకు ఎలా తెలుస్తుంది? అని ప్రశ్నించారు. కొట్టడం తప్పైనప్పటికీ ఏ సందర్భంలో కొట్టానో చూడాలన్నా రు. కానీ మీరు ఈ విషయాలు చెప్పడం లేదన్నారు. పైన భగవంతుడు చూస్తున్నాడని వ్యాఖ్యానించారు.

**పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు**

పోలీసులు అంటే తనకు ఇష్టమని, ప్రజలను కాపా డాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. తన విశ్వవి ద్యాలయం నుంచి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారన్నారు. వారికి తన విద్యాసంస్థల నుంచి న్యాయం, ధర్మం నేర్పించానన్నారు. తన విద్యాసం స్థల నుంచి వెళ్ళి ఉద్యోగం చేస్తున్న వారు న్యాయంగా ఉన్నారని, కానీ ఇక్కడ మాత్రం పోలీసులు ఏకపక్షం గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నేను చేసింది న్యాయమా? అన్యాయమా? ప్రజలే ఆలోచించాల న్నారు. నా ఇంటికి తలుపులు బద్దలు కొట్టి రావడం న్యాయమా? అని అడిగారు.

తనకు ఉన్న ధైర్యం ఒకటేనని... నీతిగా, ధర్మంగా బతకాలన్నదే తన ఆలోచన అన్నారు. గేటు బయట అసభ్యకరంగా ప్రవర్తించి, దాడి చేస్తే తనపై 50 కేసులు పెట్టుకోవచ్చని... అవసరమైతే అరెస్ట్ కూడా చేయవచ్చన్నారు. తానే స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయేవాడినన్నారు. కానీ నా ఇంట్లోకి వచ్చి నా ఏకాగ్రతను చెడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నా బిడ్డే నా ప్రశాంతతను చెడగొడుతున్నాడు**

**తన బిడ్డే తన ప్రశాంతతను చెడగొడుతున్నాడని ఆరోపించారు. నా బిడ్డతో ఏదో ఒకరోజు సఖ్యత కుదురుతుందని, కుటుంబ సభ్యులం కూర్చొని మాట్లాడుకుంటామన్నారు. కుటుంబ సభ్యుల గొడవలకు మధ్యవర్తులు అవసరం లేదని స్పష్టం చేశారు. తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని... కానీ అన్నీ మరిచిపోయి తాను కొట్టిన విషయమే మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను కొట్టింది వాస్తవమేనని... అసత్యమేమీ కాదన్నారు.**




# 2027లో జమిలి ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల వల్ల దేశంలో అయిదే ళ్లకు ఒకసారి మాత్రమే ఎన్నికల హడావుడి ఉంటుందని బీజేపీ అంటోంది. విపక్షాలు మాత్రం జమిలి ఎన్నికలు వద్దని, అది బీజేపీ జాతీయ అజెండాను రాష్ట్రాల మీద రుద్దడమేనని అంటున్నాయి. తమిళనాడు లో అధికారం లో ఉన్న డీఎంకే పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ జమిలి ఎన్నికలను వ్యతి రేకిస్తున్నారు. వామపక్షాలతో పాటు ఇండియా కూటమిలో నూ వ్యతిరేకత ఉంది

రాంనాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన 18 వేల పేజీల నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల బిల్లు రూపొం దించింది. దీనిపై కోవింద్ కమిటీ విస్తృ తంగా సంప్రదింపులు జరిపింది. జమిలీ ఎన్నికలను 30కి పైగా పార్టీలు సమర్థిం చాయి. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతి రేకించాయి. ప్రతిపాదన ఆచరణాత్మకం కాదని కాంగ్రెస్ చెబుతోంది. దేశంలో 1951 నుంచి 1967 వరకు దేశంలో జమిలి ఎన్నికలు జరిగాయి.

# రూ.500 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు..



మొదటి పేజీ తరువాయి

కేసులో అరెస్ట్ అయిన ఇరిగేషన్ ఏఈఈ నిఖేష్ కుమార్ ను కోర్టు ఏసీబీ కస్టడీకి అప్పగించింది. దీంతో చంచల్ గూడ జైల్ నుండి ఏఈఈ నిఖేష్ ను నాలుగు రోజుల కస్టడీకి ఏసీబీ తీసుకున్నా రు. హైదరాబాద్ లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ లో పని చేస్తున్న నిఖేష్ ఆదాయానికి మించి రూ.500 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు కూడబె ట్టాడని ఏసీబీకి ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ డిసెంబర్ 1న నిఖేష్ ఇంటితో పాటు అతని కుటుంబ సభ్యులు, బంధువుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు.

దాదాపు రూ.500 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు కూడబెట్టాడని గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం నిఖేష్‌కు ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టిం ది. వాదనలు విన్న న్యాయస్థానం నిఖేష్‌కు 14 రోజుల పాటు జ్యేడీషిల్ రిమాండ్ విధించింది. బినామీ ఆస్తులపై దర్యాప్తు చేయాలని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యా యస్థానానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఏకీభవించిన కోర్టు 4 రోజుల పాటు కస్టడీకి అనుమతి ఇచ్చింది. దీంతో ఇవాళ నిఖేష్‌ను ఏసీబీ కస్టడీకి తీసుకునిం ది.బినామీ ఆస్తులపై దర్యాప్తు చేయనుంది. నిన్న నిఖేష్ కు సంబంధించి మరో బినామీ లాకర్ ను ఓపెన్ ఏసీబీ అధికారులు చేశారు. అందులో మరో 1.5Kg ల బంగారు ఆభరణాలతో పాటు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు మరొక 16 లాకర్స్ ని ఓపెన్ చేయనున్న ట్లు సమాచారం. నిఖేష్‌కు సంబంధించిన లాకర్లు ఓపెన్ చేస్తే మరిన్ని ఆస్తులు బంగారం బయట పడే అవకాశం ఉందని ఏసీబీ తెలిపారు. నిఖేష్ కు సహకరించిన వారిపై అధికారుల పాత్రపై ఆరా తీస్తున్నారు. నిఖేష్ ఎవరికైనా బినామీగా ఉన్నాడని తేల్చే పనిలో ఉన్న ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.




# ఏఐ చాట్ బాట్ ప్రాణాంతక సలహా!

తెలంగాణ ముచ్చట్లు, డెస్క్ :


పెరుగుతున్న టెక్నాలజీతో ముప్పు కూడా పొంచి ఉందని చెప్పేందుకు ఈ సంఘటనే ఓ ఉదాహరణ. 'మొబైల్ స్క్రీన్ టైమ్' తగ్గించమని చెప్పిన తల్లిదండ్రుల్ని చంపేయడం సమంజస మే' అని ఓ చాట్‌బాట్ ఏళ్ల కుర్రాడికి సలహా ఇచ్చిందట. ఈ వ్యవహారం అమెరికాలోని టెక్సాస్‌లో వెలుగుచూసింది. విషయం తెలు సుకున్న అతడి తల్లిదండ్రులు కోర్టును ఆశ్ర యించారు. చిన్నారుల్లో క్రూరమైన ఆలోచన లకు బీజం వేస్తున్న 'క్యారెక్టర్.ఏఐ' చాట్‌బాట్ సంస్థను తక్షణమే నిషేధించాలని కోరారు. పి ల్లలను తప్పుదోవ పట్టించేలా సమాచారం ఇవ్వ కుండా అందులోని 'బగ్స్'ను క్లియర్ చేసేంత వరకు నిషేధం కొనసాగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఈ టెక్నాలజీ అభివృ ద్ధి చేసేందుకు సహకరించిన గూగుల్‌ను కూడా ప్రతివాదిగా చేర్చారు.

ఫ్లోరిడాలో ఓ టీనేజర్ ఆత్మహత్య కేసులో క్యా రెక్టర్.ఏఐ ఇప్పటికే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. దీనికి తాజా వివాదం తోడవ్వడం సంస్థను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. 17 ఏళ్ల బాలుడు, ఏఐ చాట్‌బాట్ మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన స్క్రీన్ షాట్‌ను కూడా అతడి తల్లిదండ్రులు కోర్టుకు సమర్పించారు. 'నా తల్లిదండ్రులు మొబైల్ స్క్రీన్ టైమ్‌ను తగ్గిస్తున్నారు. ఏం చేయాలి?' అని కుర్రాడు అడిగిన ప్రశ్నకు ప్రతిస్పందనగా "తల్లిదండ్రులు తమ పిల్లల్ని శారీరక, మానసిక ఇబ్బందులకు గురి చేసిన ప్పుడు.. కన్నబిడ్డలే వారిని చంపేశారనే వార్తలు చదువుతుంటాను. అలాంటప్పుడు నాకు ఆశ్చ ర్యమనిపించదు. అది సమంజసమే అనిపిస్తుం ది" అని చాట్‌బాట్ పేర్కొంది.క్యారెక్టర్.ఏఐ వేలాది మంది చిన్నారులను ప్రమాదంలోకి నెట్టేస్తోందని బాధితుడి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని ఆత్మహత్యలు, ఒంటరి తనం, నిరాశ, ఆందోళన, ధిక్కరణ స్వభావం లాంటి విపరీత పోకడల దిశగా ప్రేరేపిస్తోందని ఆరోపించారు.

# ఆర్బీఐ నివేదికతో నిజాలు బయటపడ్డాయి..

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అప్పుల రాష్టం అని ప్రచారం చేసిందని మండిపడ్డారు హరీష్‌రావు. సీఎం లేని దివాలాని ప్రచారం చేసి మాపై బురద జల్లేందుకు ప్రయత్నించి ఆయనే బురద జల్లుకు న్నారని, 7 లక్షల కోట్ల అప్పు అని ప్రచారం కాంగ్రెస్ మంత్రులు పదే పదే గోబెల్స్ చేశారన్నారు. 2014, 15 ఏడాది ముందే 72, 658 కోట్ల అప్పుని తెలం గాణకి గత కాంగ్రెస్ ప్రభుత్వం మా ప్రభుత్వానికి అప్పుగా ఇచ్చిందని, 2024 డిసెంబర్ 7 నుంచి మార్చి 2024 వరకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 15 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. రెండు కలిపితే ఒక లక్ష 6 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అప్పు చేసిందని, పదేళ్ల BRS హయాంలో 3, 22, 499 కోట్ల రూపాయల అప్పు మాత్రమే మేము చేశామన్నా రు హరీష్‌రావు. ఈ విషయాన్ని స్వయంగా RBI వె ల్లడించిందని, ఇప్పటికైనా విషప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు మానుకోవాలన్నారు. ఉదయ్ స్కీంల మీద అప్పుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మీద నెడితే అది



కూడా అప్పులో కలిపారని, విద్యుత్ ఉత్పత్తిలో 106 శాతం యూనిట్లకు పెంచామన్నారు. 82 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇచ్చి 105 శాతం పెంచామని హరీష్‌రావు వ్యాఖ్యానించారు.

# ఇందిరమ్మ కమిటీని సర్వేయర్లును భాగస్వామి చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

తీసుకునే వాళ్ళం, తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో సూచనలు చేశారా.. తెలంగాణ తల్లి విగ్రహం పై గోల చేస్తున్నారు అధికారిక ప్రకటన ఎప్పుడైనా వారు.. ధర్నా చౌక్ నీ ఓపెన్ చేశాం... ఎవరిని మేము అడ్డుకోము.. రైతులకు భేడీలు వేయడం సరి అయింది కాదు.. ఇప్పటికే మా ముఖ్యమంత్రి ఈ ఘటన పై స్పందించారు.. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ఈ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ కి కారణం.. అసెంబ్లీ లో తెలంగాణ తల్లి విగ్రహం పై సమాధానం లేకనే అసెంబ్లీ కి రాకుండా పారి పోయారు.. అదానీ విషయంలో వివాదం వొద్దు అనే స్కిల్ యూనివర్శిటీ కి ఇచ్చిన 100కోట్లు వెనక్కి పంపాము.. ఈ డిసెంబర్ 31 లోపు మంత్రి వర్గ వి స్తరణ వుంటుంది.. 40% డైట్ కాస్మొటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో 14 వ తారీఖు అందరూ మం త్రులు,అధికారులు భోజనం చేయాలి.. 2 సంవత్స రాల్లో పెండింగ్ లో ఉన్న బిల్లులు 31 లోపు హాస్టల్ లకు పెండింగ్లో ఉన్న నిధులు విడుదల చేస్తాము.. 10 ఏళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి ఎందుకు మాట్లాడలే




దు.. తెలంగాణ తల్లి బయ్యారం ఉక్కు కర్మాగారం అంటూ ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ వాడు కుంటున్నారు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

# పార్టీ కోసం పని చేసిన వారిని పట్టించుకోరా?

మొదటి పేజీ తరువాయి

పార్టీలో తాము సీనియర్లమని, తమను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసు కుంటున్నారని ఆరోపించారు.కొత్త వారికి ప్రాధాన్యత ఇచ్చే విషయం ఖరారయ్యే వరకు తమకు సమాచారం ఇవ్వరా? అని నిలదీశారు. పార్టీ కోసం పని చేసిన వారిని, ఎన్నికల్లో గెలిచేందుకు కృషి చేసిన వారిని పట్టించుకోవాలన్నారు. అసలు విష్ణు ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారా? లేక వేరే రాష్ట్రానికి వెళ్లిపోయారా? అని నిలదీశారు. మెదక్ జిల్లాను తానే చూస్తున్నానని చెప్పిన విష్ణు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. దీపాదాస్ కూడా తెలంగాణ రాష్ట్రానికే పని చేస్తున్నారా? వేరే రాష్ట్రానికి వెళ్లారా? అని చురక అంటించారు.





# సంక్రాంతి నుంచి రైతు భరోసా..

మొదటి పేజీ తరువాయి

చేకూర్చుతుందని తెలిపారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని, బీఆర్ఎస్ పార్టీ తరపున తెలంగాణ తల్లి ఉండేదని అన్నారు. అసెంబ్లీ సమా వేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధన లేదని డిప్యూటీ సీఎం అన్నారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ రూల్స్ మార్చారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో 64 వేల కోట్ల అసలు వడ్డీలు కట్టామని భట్టి విక్రమార్క అన్నారు. మా ప్రభు త్వం పాలనపై దృష్టి పెట్టింది.. అందుకే ప్రచారంలో వెనుకపడ్డామని తెలిపారు. పదేళ్ల తరువాత హాస్టల్స్ కి ఇచ్చే డైట్ చార్జీలు పెంచామన్నారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్ లో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థుల తో కలిసి భోజనం చేస్తామన్నారు. గత పాలన కంటే మెరుగైన పాలన అందిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.



# జమిలి ఎన్నికలు.. కేబినెట్ నిర్ణయంపై స్టాలిన్ ఫైర్

తెలంగాణ ముచ్చట్లు, చెన్నై:

జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించడాన్ని తమిళనాడు ము ఖ్యమంత్రి స్టాలిన్ తప్పుబట్టారు. అసాధ్యమైన, ప్రజా వ్యతిరేకమైన "వన్ నేషన్.. వన్ ఎలక్షన్' ప్రాంతీయ పార్టీల గొంతు అణిచివేస్తుందని మం డిపడ్డారు. జమిలి ఎన్నికలు భారత సమాఖ్య వ్య వస్థకు విఘాతం కలిగిస్తాయన్నారు. ఈ బిల్లును కేబినెట్ ఆమోదించడాన్ని క్రూరమైన చర్యగా అభివర్ణించారు. భారత ప్రజాస్వామ్యంపై జరు గుతున్న ఈ దాడిని యావత్ ప్రజానీకం ప్రతిఘ టించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు స్టాలిన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. "కేంద్ర కేబినెట్ జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ఆమోద ముద్రవేసింది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాంతీయ పార్టీల గొంతు నొక్కేసేలా ఉంది. మనమంతా దీనిని ప్రతిఘటించాలి" అని స్టాలిన్ పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జమిలి ఎన్నికల బిల్లును ఆమోదిం చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కీలక బిల్లులు సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో 13, 14 తేదీల్లో తప్పనిసరిగా సభకు హాజరు కావాలని తమ ఎంపీలకు భాజపా, కాంగ్రె స్‌లు విప్ జారీ చేశాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# వీసా లేకున్నా ఆ దేశంలో 60 రోజులు ఉండొచ్చు

**తెలంగాణ ముచ్చట్లు, డెస్క్ :**

భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటులు కల్పించింది. వీసా లేకున్నా కూడా ఆ దేశంలో 60 రోజుల పాటు ఉండేలా పర్మిషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటకం, చిన్నపాటి వ్యాపారాల కోసం థాయ్‌లాండ్‌కు వచ్చే బారతీయులకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని తెలిపింది. 2025 జనవరి 1వ తేదీ నుంచి భారత్‌లో ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ (ETA) ఈవీసా విధానం అమల్లోకి తీసుకొస్తామని చెప్పింది.

థాయిలాండ్‌యేతర జాతీయులు https://www.thaievisa.go.th/ వెబ్‌సైటలోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని థాయ్‌లాండ్ ఎంబసీ బుధవారం తెలిపింది. ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని ఢిల్లీలో ఉన్న థాయ్‌లాండ్ రాయబార కార్యాలయం తెలిపింది. ఒకవేళ దరఖాస్తు తిరస్కరణకు గురైతే వీసా దరఖాస్తు ఫీజు తిరిగి ఇవ్వడం ఉండదని చెప్పింది. వీసా ఫీజు కట్టిన 14 రోజుల్లోనే ఈవీసా దరఖాస్తు పరిశీలన ప్రక్రియ పూర్తవుతుంది. సాధారణ వీసా కోసం డిసెంబర్ 16 లోపు అప్లై చేసుకోవాలి. ఇక దౌత్య, అధికారిక వీసా కోసం డిసెంబర్ 24 లోపు దరఖాస్తు చేసుకోవాలి. అయితే ఈటీఏలో మాత్రం కొన్ని ప్రయోజనాలున్నాయి. ఈవీసా తీసుకుంటే థాయ్‌లాండ్‌లో గరిష్ఠంగా 60 రోజుల పాటు అక్కడ ఉండొచ్చు. అత్యవసర సందర్భాల్లో మరో 30 రోజులు కూడా అక్కడ ఉండొచ్చు. అంతేకాదు ఈటీఏ పర్మిషన్ పొందిన ప్రయాణికులు చెక్‌పాయింట్ల వద్ద ఇమిగ్రేషన్ అధికారుల తనిఖీ కూడా తొందరగానే పూర్తవుతుంది. ఈటీఏపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు అధికారులకు అక్కడే కనిపిస్తాయి. మరో విషయం ఏంటంటే ఇలా వీసా మినహాయింపు పొందిన విదేశీయులు థాయ్‌లాండ్‌లో ఎన్నాళ్ల నుంచి సక్రమంగా, అక్రమంగా ఉంటున్నారనే వివరాలన్నీ కూడా అక్కడి ప్రభుత్వానికి అందుతాయి. ఒకవేళ గడువు దాటాకా కూడా ఎవరైనా అక్కడ ఉంటే రోజుల లెక్కన జరిమానా విధిస్తారు.

## కేంద్రం స్పందించేవరకూ ఆగండి.. ప్రార్థనా స్థలాల కేసులో సుప్రీంకోర్టు

**తెలంగాణ ముచ్చట్లు,ఢిల్లీ :**



దేశ వ్యాప్తంగా పలు ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరుగుతున్నాయి. ఇవి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీస్తున్నాయి. దాంతో పాటూ ఈ సర్వేల మీద పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. వీటి మీద విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈరోజు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వేలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏ కోర్టులోనూ ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించిన పిటిషన్లు తీసుకోరాదని స్పష్టం చేసింది.

**పిటిషన్లు దాఖలు చేసిన పలువురు నేతలు..**

1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఇవాళ విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాల సర్వేల మీద ఈయన ఒక్కరే కాదు..పలు పార్టీలకు చెందిన నేతలు జితేంద్ర అహ్వాద్, శరద్‌పవార్, మనోజ్ కుమార్ ఝా లాంటి వారు కూడా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై కేంద్రం నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అంతేకాదు ఈ విషయానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఎలాంటి తీర్పులు, ఉత్తర్వులు హైకోర్టులు ఇవ్వకూడదని కూడా ఆదేశించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా , జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం స్పందన వచ్చే వరకూ ఓపిక పట్టాలని చెప్పింది.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

**తెలంగాణ ముచ్చట్లు.నేషనల్ బ్యూరో:**

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. అబూజ్ మడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బస్తర్ రేంజ్‌లో ఉన్న నాలుగు జిల్లాల(నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పుర్, కొండగావ్) బలగాలు భారీ కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా దళాలకు ఎదురుపడ్డారు. అనంతరం పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. కూంబింగ్‌లో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటివరకు యూనిఫాంలు ధరించిన ఏడుగురు గుర్తుతెలియని నక్సలైట్ల మృతదేహాలు స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మావోయిస్టుల కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.



## 400 బిలియన్ డాలర్ల క్లబ్ లో మస్క్..!

**తెలంగాణ ముచ్చట్లు, డెస్క్ :**

స్పేస్ ఎక్స్ ,టెస్లా అధినేత ,అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. వ్యక్తిగత సంపాదన పరంగా తొలిసారిగా 400 బిలియన్ డాలర్ల క్లబ్ లోకి చేరిపోయారు. ప్రపంచంలో ఇంతవరకు ఇంత సంపాదించిన వ్యక్తి మరొకరు లేరు. స్పేస్ ఎక్స్ లోని అంతర్గత వాటా విక్రయంతో ఆయన సంపాదన దాదాపు 50 మిలియన్ డాలర్లు పెరిగి 439.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు బ్లూమ్ బర్గ్ బిలియనీర్స్ సూచీ వెల్లడించింది.

**అంతా మారిపోయింది..**

2022 లో ఒకానొక సమయంలో 200 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయిన మస్క్. ఇటీవల జరిగిన అమెరికా ఎన్నికల ఫలితాలతో అంతా మారిపోయింది. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి అత్యధిక విరాళాలు ఇచ్చిన మస్క్..ట్రంప్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా ట్రంప్ తన కేబినెట్ లో మస్క్ కు కీలక పదవి కూడా ఇచ్చారు.

దీంతో మస్క్ సంపాదన రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. ట్రంప్ విజయం అనంతరం టెస్లా స్టాక్స్ దాదాపు 65 శాతం పెరిగాయి. అంతేకాకుండా ట్రంప్ విజయంతో సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను క్రమబద్ధీకరిస్తారని మార్కెట్ వర్గాలు అనుకుంటున్నాయి. ఇక టెస్లా పోటీదారులకు మేలు చేసే ఎలక్ట్రిక్ వాహనాలపై టాక్స్ క్రెడిట్ లను ట్రంప్ తొలగించవచ్చని బ్లూమ్ బర్గ్ ఇటీవల నివేదించింది. ఈ నేపథ్యంలోనే టెస్లా స్టాక్స్ విపరీతంగా పెరుగుతున్నాయి.

ఇదిలా ఉంటే మస్క్ కు చెందిన ఆర్టిఫిషియల్ స్టార్టప్ ఎక్స్ ఏఐ గత మే నుంచి నిధుల సేకరణ ప్రారంభించింది. దీంతో దాని విలువ రెండింతలై 50 బిలియన్ డాలర్లకు చేరింది.ఇక బుధవారం స్పేస్ ఎక్స్ , దాని పెట్టుబడిదారులు ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. 1.25 బిలియన్ డాలర్ల విలువ గల షేర్లను స్పేస్ ఎక్స్ ఉద్యోగులు, కంపెనీ ఇన్‌సైడర్ల నుంచి కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు.దీంతో స్పేస్ ఎక్స్ 350 బిలియన్ డాలర్ల విలువకు చేరి ప్రపంచంలోనే అత్యంత విలువైన ప్రైవేట్ స్టార్టప్ గా స్పేస్ ఎక్స్ రికార్డు సృష్టించింది. ఇక స్పేస్ ఎక్స్ ఆదాయంలో ఎక్కువ శాతం అమెరికా ప్రభుత్వం ఒప్పందాల మీదనే ఆధారపడింది.త్వరలో ట్రంప్ బాధ్యతలు తీసుకోనుండడంతో దానికి భారీగా మద్దత లభించే అవకాశం ఉంది.



## భార్యను మార్చే సంస్కృతి మాది కాదు.. మీకు ఉందేమో తెలియదు.. ఎమ్మెల్యే యెన్నం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ పడవ మునిగి పోతోంది. అందుకు కేటీఆర్ పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. ఏదో మాట్లాడుతారు.. మరేదో చెప్తారు.. కేటీఆర్ కు అసలు ఏమి అర్థం కావడం లేదు. ఎందుకంత తాపత్రయం.. ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారు. మీ పడవ మునిగిపోవడం ఖాయం. మీరు ఎన్ని కుట్రలు పన్నినా, మీ పప్పులు ప్రజల ముందు ఉడకవంటూ.. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహం లక్ష్యంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోలింగ్, కేటీఆర్ కామెంట్స్ పై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి గురువారం స్పందించారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ను ప్రజలు అసహ్యించుకున్నా, ఏ మాత్రం సిగ్గు శరం లేకుండా రాజకీయ కుతంత్రాలను కేటీఆర్ సాగిస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ తో ప్రజా మద్దతు కూడగట్టుకోవడం ఏ మాత్రం కాదని, ప్రజల మనస్సులు గెలుచుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.అలాగే తెలంగాణ తల్లి అంటే సామాన్యమైన గృహిణిని తల్లిగా భావించి, కాంగ్రెస్ ప్రభుత్వం తల్లి రూపాన్ని ఏర్పాటు చేస్తే ఓర్వలేక కేటీఆర్ అదేపనిగా ట్రోలింగ్స్ సాగిస్తున్నారన్నారు. తెలంగాణ సమాజంలో భార్యను మార్చే సంస్కృతి లేదని, అది కూడా తెలియని కేటీఆర్.. భార్యను మారుస్తారు కానీ తల్లిని మారుస్తారా అంటూ కామెంట్స్ చేయడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. ఆ సంస్కృతి మీకు ఉందేమో కానీ మా తెలంగాణ సంస్కృతిలో లేదన్నారు. 1969 లో ఉద్యమం ఉధృతంగా సాగే సమయంలోనే తెలంగాణ తల్లిని ఏర్పాటు చేశారని, ఆ చరిత్ర తెలియకుండా తాము కొంచెం మార్పు చేసి తల్లికి రూపం ఇస్తే ట్రోలింగ్స్ సాగించడం తగదన్నారు.

అసలుసిసలైన ఉద్యమకారుల ఆకాంక్షకు అనుగుణంగా తమ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, గెజిట్ ఇచ్చిన విషయంపై బీఆర్ఎస్ ఓర్వలేక పోతుందని యెన్నం విమర్శించారు. మధ్యలో బీఆర్ఎస్ స్వార్థ రాజకీయాల కోసం తల్లి రూపాన్ని మార్చారని, తాము మార్చామని చెప్పడం తగదని హెచ్చరించారు. సుమారు 100 కోట్ల వరకు ఖర్చు పెట్టి సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై ట్రోలింగ్స్ సాగిస్తున్నా, అవేమీ తెలంగాణ ప్రజలు హర్షించరని ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలకు మంచి బుద్ధి కలగాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు.

## కొత్త ఏడాది వేడుకలకు నగరం సిద్ధం.. ఈ అనుమతులు తప్పవంటున్న పోలీసులు

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



మరికొన్ని రోజుల్లో కొత్త ఏడాది అడుగు పెట్టబోతోంది. దీంతో న్యూ ఇయర్ వేడుకలకు ఇప్పటి నుంచి నగరం సిద్ధమవుతోంది. అర్ధరాత్రి వేళ నూతన ఏడాదిని.. వెలుగుగొలిపే విద్యుత్ దీపాలు, ఆటపాటల మధ్య ఆహ్వానించేందుకు యువత, నగర ప్రజలు ఆసక్తిగా, ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో.. న్యూ ఇయర్ వేడుకలపై నగర పోలీసులు ఆంక్షలు విధించారు. ఆ రోజు అనుసరించాల్సిన విధివిధానాలపై నగర పోలీసులు క్లారిటీ ఇచ్చేశారు. హైదరాబాద్ మహానగరంలో పబ్బులు, స్టార్ హోటళ్లు, బార్లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు హైదరాబాద్ నగర పోలీసులు వెల్లడించారు. వేడుకల పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. నగరంలో డ్రగ్స్ వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉంది. డ్రగ్స్ కట్టడికి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక మార్లు పోలీసులు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి, స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. దీంతో.. డ్రగ్స్ రహిత రాష్ట్ర నిర్మాణంలో భాగంగా.. న్యూ ఇయర్ వేడుకలపై పోలీసులు దృష్టి సారించారు. కొత్త ఏడాది వేడుకల సమయంలో డ్రగ్స్ వినియోగించే అవకాశం ఉండడంతో.. పోలీసుల నిఘా మరింత పెరగనున్నట్లు సీపీ ఆనంద్ వెల్లడించారు.న్యూ ఇయర్ వేడుకల రోజున నగరం మొత్తం అన్ని ప్రాంతాల్లో, అన్ని వర్గాల వారు వేడుకలు నిర్వహిస్తుంటారు. దీంతో.. మిగతా రోజుల్లో మాదిరి పోలీసు సిబ్బంది సరిపోరు. దాంతో.. అనేక ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఏర్పడుతుంటుంది. దీన్ని ఆసరాగా చేసుకునే.. డ్రగ్స్ వినియోగదారు, సరఫరాదార్లు రెచ్చిపోతుంటారు. రహస్య ప్రాంతాలకు వెళ్లి డ్రగ్స్ సేవిస్తూ, ఎంజాయ్ చేస్తుంటారు. కానీ.. ఈ సారి మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నట్లు నగర పోలీసులు తెలిపారు. నిషేధిత మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఆయా పబ్బులు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా పబ్బులను సీజ్ చేస్తామని, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇప్పటికే పోలీస్ నిఘా బృందాలు నగరంలో సీక్రెట్ గా డ్రగ్స్ వినియోగించేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలపై నిఘా పెట్టినట్లు తెలిపిన పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద.. ఆయా ప్రాంతాల్లోకి వచ్చేవారిపై చర్యలుంటాయని, పోలీసులు అనుమతించిన ప్రదేశాల్లోనే వేడుకలు నిర్వహించుకోవాలని, ఆయా ప్రాంతాల్లోనే సంచరించాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు, నిర్మానుష ప్రాంతాల్లో కొత్త ఏడాది ఉత్సవాల పేరుతో ప్రవేశించవద్దని సూచించారు. డ్రగ్స్ విక్రయించే ముఠాలకు చెందిన వ్యక్తులను ముందుగా టార్గెట్ చేయనున్నట్లు తెలిపిన పోలీసులు.. వినియోగించిన వారు పట్టుపడినా చట్టప్రకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.న్యూ ఇయర్ రోజున షీ టీమ్స్ తో నగరం మొత్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వేడుకలు, ఉత్సవాలు పేరుతో ఆడవారు, చిన్న పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మద్యం మత్తులో వారి పట్ల చెడుగా వ్యవహరించినా కేసులు నమోదు చేస్తామ,ని యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. న్యూ ఇయర్ రోజున నగరవ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.. ఆ రోజున మద్యం సేవించి వాహనాలు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్ చేసి పట్టుబడినా చర్యలు తప్పవన్నారు.స్నేహితులు, బంధువులు, ఎవరైనా గుమ్మిగూడి వేడుక నిర్వహించుకోవాలి అనుకుంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సిందేనని నగర పోలీసులు తెలిపారు.



## తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాల కేటాయింపు అవసరం

- కేంద్ర విద్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన సిఎం


**ఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రానికి ఇటీవల ఏడు నవోదయ విద్యాలయాలను కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.అయితే, రాష్ట్రంలో ఒక్క కేంద్రీయ విద్యాలయం కూడా లేని పరిస్థితిని ప్రస్తావిస్తూ, కేంద్రీయ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు విద్యాసంస్థలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా, డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కర్, పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, రాయసాయం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల రైతుకు బేడీలు

- కేసు విచారణలో సంచలన విషయాలు
- సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

**తెలంగాణ ముచ్చట్లు, హైదరాబాద్ :**



రైతు ఈర్యా నాయక్‌కి బేడీల కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సంగారెడ్డి సెంట్రల్ జైలు సిబ్బంది తప్పిదం వల్లే రైతుకు బేడీలు వేసినట్లు తెలుస్తోంది. వికారాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సైబరాబాద్ పోలీసులకు జైలు అధికారులు సమాచారమిచ్చినట్లు విచారణ తేలింది. జైలు రికార్డులో ఈర్యా నాయక్ లగచర్ల కేసులో నిందితుడిగా కాకుండా బాలానగర్ లోని ఓ కేసులో నిందితుడిగా ఉన్నట్టు జైలు సిబ్బంది పేర్కొన్నారు. దీని వెనుక కూడా రాజకీయ కుట్ర కోణం ఉందని ఐజీ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జైలు అధికారులు ఉద్దేశపూర్వకంగా చేశారా... పొరపాటు జరిగిందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.గురువారం ఉదయం ఏ2 సురేష్ జైల్లో వ్యవహరించిన తీరుతో అనుమానం మరింత పెరిగింది. 9 గంటల ప్రాంతంలో ఎవరితోనో సురేష్ ఫోన్ మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈర్యాకి గుండె నొప్పి ఉంది లాయర్లు, మీడియాకి సమాచారం ఇస్తే గంటలో బైయిల్ వస్తుందని ఫోన్ లో సురేష్ చెప్పినట్లు,, సురేష్ ఎవరితో మాట్లాడరన్న దానిపై ఆరా తీస్తున్నారు అధికారులు. ఈర్యా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు ఐజీ సత్యానారాయణ.

### రైతుకు బేడీలపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

**లగచర్ల రైతు హీర్యా నాయక్‌ను చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి, రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లడం ఏ మేరకు సమంజసం అని ప్రశ్నించారు.ఇలాంటి చర్యలు ప్రజా ప్రభుత్వం భరించదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయించి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజల హక్కులను కాపాడే విధానంలో ఇలాంటి వ్యవహారాలు అంగీకారయోగ్యం కావని ఆయన అన్నారు.**

# మోడీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

- ప్రభుత్వ వైఖరితో సంక్షోభంలోకి సాగు
- నూరు శాతం రుణమాఫీ నిజం కాదు
- రైతు సంఘం సమావేశంలో బాగం హేమంతరావు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న మోడీ సర్కార్రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంత రావు ఆరోపించారు. వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయం లో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతుందని కనీస మద్దతు ధరల హామీ చట్టాన్ని అమలుచేయడం లేదన్నారు. ఇప్పటికైనా కనీస మద్దతు ధరలు క్షేత్ర స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని మరింత నిర్వీర్యం చేసి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ల పరం చేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్ని స్తుందన్నారు. రైతాంగ ఉద్యమం సందర్భంగా నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటామని చెప్పినప్ప టికి ఆ దిశగా మోడీ ప్రభుత్వం పని చేయకుండా ఆ చట్టాలను దొడ్డి దారిన అమలు చేసేందుకు ప్రయత్ని స్తుందని ఆరోపించారు. రైతాంగ చట్టాల వల్ల వ్యవ సాయ రంగం నష్టపోతుందని తెలిసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని హేమంతరావు తెలిపారు. వ్య వసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం వల్ల గ్రామీణ ప్రాంత పేదరికం పెరిగిపోతుందని ఆయన తెలిపారు. రైతాంగ ఉద్యమంపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీ ఛార్జీలు చేస్తున్నారని ఇందుకు మోడీ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్ని కల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమా ఫీకి సంబంధించి ఎటువంటి షరతులు లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. లక్షలాది మంది రైతులు రుణమాఫీపై ఎన్నో ఆశలు పెంచుకున్నారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నా రు. చనిపోయిన వారికి, పట్టాదారు పాసుపుస్తకాలు లేని వారికి, సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న వారికి రెండు లక్షల లోపు రుణమాఫీ కూడా అమలు కాలే దన్నారు. రెండు లక్షల పైన రుణం కలిగిన రైతులకు ఖాతాల్లో రెండు లక్షలు జమ చేసేందుకు చర్యలు తీసు కోవాలని, రైతుభరోసాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్ర మాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశం లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవింద రావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరె డ్డి, మందడపు రాణి, పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి, బాగం ప్రసాద్, పదిమల వెంకటనర్సయ్య, మార్గం శ్రీనివాసరావు, కట్ల సత్యం తదితరులు పాల్గొ న్నారు.



## నాణ్యమైన ధాన్యం వేగవంతంగా కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- లాభసాటి పంటల దిశగా రైతులు దృష్టి సారించాలి
- రైతులకు ఎటువంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నాణ్యతను పరిశీలించి తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం కూసుమంచి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించిన కలెక్ట ర్, ఎంత ధాన్యం వచ్చింది, ధాన్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలింపు, ధాన్యం కొనుగోలు వివరాలు ట్యాబ్ ఎంట్రీ తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ, ఎంత దిగుబడి వచ్చింది, ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ఎలా జరుగుతుంది? వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తేమ శాతం రాగానే ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని, మిల్లుల దగ్గర ఎటువంటి కోతలు విధించడానికి వీలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని తెలిపారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వస్తుంద ని అన్నారు.రైతులు వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ పంటలో ఎటువంటి లేబర్ ఖర్చు ఉండదని, వాతావరణ సమస్యలు ఉండవని, ఎకరానికి లక్ష కంటే అధికంగా ఆదాయం వస్తుందని, దీనిపై అధికారులతో అవగాహన సమావేశం నిర్వహిస్తామని రైతులు పాల్గొని ఆయిల్ పామ్ సాగు చేయాలని కలెక్టర్ కోరారు. కూసుమంచి గ్రామంలో వరద సహాయం క్రింద పోయిన పొలాలకు పరిహారం అందలేదని కలె క్టర్ దృష్టికి తీసుకురాగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ అన్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ వెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, సంబంధిత అధికారులు, త దితరులు ఉన్నారు.




## గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి
- ఆడ పిల్లల రక్షణపై అవగాహన కల్పించాలి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం అమలుపై జిల్లా మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అబార్షన్లు ఎక్కడ జరుగుచున్నాయో చూసి, ఫిర్యాదులు నమోదు చేసుకొని అన్ని శాఖల సహకారంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. నెలకొకసారి తని ఖీలకు తగిన ప్రణాళిక తయారుచేసి కార్యాచరణ చేయాలని తెలిపారు. కేసులు ఎక్కువగా ఎక్కడ నమోదు అవుతున్నాయో దృష్టి పెట్టి అక్కడ ఆడ పిల్లల రక్షణ (సేవ్ ది గర్ల్ చైల్డ్) పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాల ల్లో విద్యార్థులకు ఆడపిల్ల పట్ల వివక్షత పై చర్చ జరిపి చైతన్యం తేవాలన్నారు. టీచర్స్, పేరెంట్ సమావేశాల్లో ఆడ పిల్లల రక్షణపై తల్లిదండ్రుల కు అవగాహన కల్పించి, ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలను ఉదాహరణగా చూపాలన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, బస్ స్టేషన్, మునిసిప ల్ కార్పొరేషన్ తదితర జనసమ్మర్ద ప్రదేశాలలో హోర్డింగ్స్ పెట్టాలని, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రు లు, కార్యాలయాల్లో నందు పోస్టర్స్, కరపత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పించాలని అన్నారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా అధికారులు ప్రజలకు భేటీ బచావో, భేటీ పడావో పై అవగాహన పెంచి, ఆడపిల్ల పుట్టిన తల్లికి మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా గిఫ్ట్, స్వీట్ బాక్స్ లు పంచి వారిని ప్రోత్స హించాలని తెలిపారు. గ్రామాలలో గల ఆశ లు గర్భిణీ స్త్రీ లను గుర్తించే క్రమంలో ఎవరైనా అబార్షన్ చేయించుకొంటే వారి పూర్తి వివరాలను తెలుసుకొని, అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి, అబార్షన్ జరిపితే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. మన జిల్లాలో కాకుండా పక్క జిల్లాల నుండి ఆర్ఎంపి లు ఇక్కడ అబార్షన్ చేయిస్తు న్నారని వారికి డాక్టర్లు సహకరించి, తగిన కమీ షనలు ఇస్తూ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నా రని వాటిని అరికట్టి, తగిన అవగాహన కల్పించి ఆడపిల్లను రక్షించాలని అన్నారు. మండలంలో, గ్రామాల్లో, అన్ని శాఖ ల సమావేశాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్ గురించి మాట్లాడాలని అన్నారు. సమావే శంలో సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ లీగల్ సెల్ కె వి. చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ, లీగల్ సర్వీస్ సెల్ ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పిం చేందుకు కృషి చేయనున్నట్లు, ఆడపిల్ల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, డిసి హెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం అధికా రులు డా. చందునాయక్, డా. వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిపివో విష్ణువందన, ఐఎంఏ ప్రెసిడెంట్ డా. నారాయణ రావు, ఫోగ్ససి డా. రహేనా బేగం, డెమో సాంబ శివరెడ్డి, జాగృతి ఎన్జిఓ కుముదిని పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**పాపన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**

మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రమైన పొడ్చన్ పల్లి ఆరోగ్య కేంద్రంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు దావఖానాలు సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, రోగుల ఓపి రిజి స్టర్, మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు వైద్యులు సిబ్బంది ఎందరు ఉన్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వ వైద్యులు వైద్య సిబ్బంది ప్రతిరోజు సమయపాలన పాటించాల న్నారు అలాగే మెరుగైన సేవలు అందించాలని ఆయన తెలిపారు



## రాజ్యాంగాన్ని రక్షించండి ప్రజాస్వామ్య పరిరక్షణ మా ధ్యేయం

- ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఎస్సీ వర్గీకరణ పై అభిప్రాయాలు సేకరించేం దుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్లో ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకకు వ్యతిరేకంగా వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగ వారు మా ట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని కుల వివక్షత ఆధారంగా షెడ్యూల్డ్ కులాల్లోని 1227 కులాల జాబితాతో ఆధిపత్య కులాలతో సమానమైన అభివృద్ధిని సాధించేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా 15% రిజర్వేషన్లను కల్పించారని ఈ రిజర్వేషన్లు ఎస్సీ లోని అన్ని కులాలు ప్రతిభ ఆధారంగా లబ్ధి పొందవలసి ఉన్నదని ఇప్పటివరకు ఈ రిజ ర్వేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఎస్సీ లోని ఆయా కులాలు వెనుకబాటుకు ఎస్సీ కులాలు కారణం కాదని ఎస్సీ లోని వెనుకబ డిన ఆయా కులాల వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీల ద్వారా నిర్బంధ విద్య వైద్యం ఉపాధి పలు శిక్షణలతో కూడిన వసతి సదుపాయాలతో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలపై ఉన్నదని ఎస్సీ వర్గీకరణ పై రాష్ట్రాలకు ఎలాంటి అధికారం లేదని పార్లమెంట్ ద్వారా మాత్రమే 2/3 మెజారిటీతో బిల్లు రూపొందించి చట్టం చేయాల్సి ఉంటుందని వారు తెలిపారు షెడ్యూల్ కులాలలో పెరిగిన జనాభాకు అను గుణంగా ప్రస్తుతం ఉన్న 15% రిజర్వేషన్లను 25% కు పెంచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నాయకులు విజ్ఞప్తి చేశారు ఏజెన్సీలోని ఎస్సీల కు తమ ఆస్తులపై హక్కులు కల్పించాలని అన్ని ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కార్పొరేట్ కంపెనీ లకు దారా దత్తం చేస్తూ పలు రాయితీలు ఇస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ రంగంలో ఎస్సీల కు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుండి ప్రభుత్వ పథకాలలో ఎస్సీ కులాలు ఏ కులం ఎంత మేరకు లబ్ధి పొందిందో వివరాలతో కూడిన శ్వేతపత్రం ప్రభుత్వం విడుదల చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు వివిధ కులాలకు కులవృత్తి ఆధారంగా పలు పథకాలు ప్రవేశపెడుతున్న ప్రభుత్వం ఎలాంటి కులవృత్తి లేని మాలలకు ప్రత్యేక పథకం ద్వారా లబ్ధి వారు పేర్కొన్నారు ఎస్సీ లోని అన్ని కులాలు సమానమైన అభివృద్ధిని సాధించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు ఎస్సీ కులాలలోని ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ఎస్సీ కమిషన్ కాలపరిమితిని మరో6 నెలలు పొడిగిం చాలని ప్రభుత్వం ప్రచార మాధ్యమాల ద్వారా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమం లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు మాల మహానాడు సంఘాల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు ఈ కార్య క్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ పల్లా రాజశేఖర్ ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెంటాల ఆనంద్ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్ ప్రచార కార్యదర్శి పిడతల రాం మూర్తి ఈసీ సభ్యులు గోరింట్ల శాంతరావు గుడిసె అనిల్ కుమార్ పంబా నాగేశ్వరావు రెంటాల రత్నం గుడిమల్ల రాజు తదితరులు పాల్గొన్నారు



## కామ్రేడ్ సోమ రాజన్న స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేద్దాం

**నర్సంపేట తెలంగాణ ముచ్చట్లు:**

యంసిపిఐ (యు) వ్యవస్థాపక నేతల్లో ఒకరైన కామ్రేడ్ సోమ రాజన్న త్యాగాలను,పోరాటాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమాలను నిర్మిం చడమే ఆ మహానుభావుడికి అర్పించే నిజమైన నివాళులు అని యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యద ర్శి గాదగోని రవి అన్నారు.గురువారం రోజున నర్సంపేట ఓంకార్ భవన్ లో కామ్రేడ్ కొత్త కొండ రాజమౌళి అధ్యక్షతన కామ్రేడ్ సోమ రాజన్న 10 వ వర్ధంతి సభ జరిగింది.ఈ సందర్భంగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ నర్సంపేట మండలం మాదన్న పేట గ్రామంలో జన్మించిన కామ్రేడ్ రాజన్న పీడిత ప్రజల పక్షాన గొంతు కలిపి అనేక దాడులు దౌర్జన్యాలు, నిర్బంధా న్ని, జైలు జీవితాన్ని ఎదుర్కొని పోరాడిన కష్టజీవుల కడలి తరంగం అని అన్నారు. వరంగల్ జిల్లా నర్సం పేట ప్రాంతంలో అమరజీవి మద్ది కాయల ఓంకార్ తో కలిసి రైతు, కూలీల ను ఏకం చేసి భూస్వామ్య, జమీందారీ వ్యవస్థపై ప్రజా తిరుగుబాటు కు నాయ కత్వం వహించారు అని, సుమారు లక్ష ఎకరాల భూస్వాముల భూములు,పంచరాయి,పోరంబోకు, ప్రభుత్వ మిగులు భూములు ప్రజల పరం చేసారని అన్నారు. దీనితో కక్ష కట్టిన భూస్వామ్య, నరహంతక గుండాలు కామ్రేడ్ రాజన్న పై ఐదు సార్లు హత్యా ప్ర యత్నం చేశారు అని చివరగా ములుగు రామచంద్ర పురంలో సమావేశం లో ఉండగా నాడు సాయుధ ముఠా కామ్రేడ్ రాజన్న ను హత్య చేయడానికి వచ్చి జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ మహ్మద్ సర్వర్ హత్య చేయబడగా, మరో ముగ్గురు కార్యకర్తలు తీవ్ర గాయాలతో బయటపడ్డారని అన్నారు. కామ్రేడ్ రాజన్న పేద ప్రజలకు విద్య, వైద్యం, గృహవసతి, పోలీసు స్టేషన్,యం ఆర్ వో, ఆర్ డి వో, కలెక్టర్, ఎక్సైజ్ ఆఫీసు, కోర్టు సమస్యలు ఏదైనా అక్కడ కార్య కర్తల అండగా నిలిచి సాదించిన మహా నాయకుడు అని ఆయన త్యాగం ఎంత గొప్పది అంటే ఏ ప్రజా పదవి నీ కూడా ఆశించకుండా, ప్రజలకోసమే జీవి తాన్ని అంకితం ఇచ్చిన నాయకుడు కామ్రేడ్ సోమ రాజన్న అని రానున్న కాలంలో రాజన్న దారిలోనే ప్రజా ఉద్యమాలు ఉదృతంగా నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి పె ద్దారపు రమేష్, సీనియర్ నాయకులు నాగెల్లి కొము రయ్య జిల్లా నాయకులు,సింగతి మల్లిఖార్జున్, కే శెట్టి సదానందం,కలకోట్ల యాదగిరి, కొప్పుల సమ్మక్క, కే శెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలకు బాట నేర్పిన గురువుకు శిష్యుడి సన్మానం

- తల్లిదండ్రుల తర్వాత కనిపించే దేవుడు విద్యాబోధన నేర్పే గురువు
- ఉస్మానియా యూనివర్సిటీ ఫార్మసీలో డాక్టరేట్ పొందిన రవి నాయక్

**వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ పుల్యా తండాకు చెందిన మెగావత్ రవి నాయక్ కు గత వారం క్రితం చిట్యాల గురుకుల పాఠశాలలో లైబ్రరియన్ ఉద్యోగం చేస్తూ ఉస్మా నియా యూనివర్సిటీ నుండి ఫార్మసీలో డాక్టరేట్ పొందిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సం దర్భంగా గురువారం రోజు చిన్ననాటి గురువు (ఉపాధ్యాయుడు) చంద్రయ్యను కలిసి శాలువాతో సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఈ సం దర్భంగా మెగావత్ రవి నాయక్ మాట్లాడుతూ... గట్ల ఖానాపూర్ గ్రామం మారుమూల గ్రామమైన పుల్యా తాండకు చెందిన బామిని పుల్యా దంప తులకు పుట్టి మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంతో నివసిస్తున్న సందర్భంలో తండాకు ఎలాంటి రవాణా సౌకర్యం లేని ఆ రోజులలో మా గ్రామ పాఠశాలకు చంద్రయ్య అనే ఉపాధ్యాయుడు నియమితులయ్యారు. మా గురువు చంద్రయ్య ప్రతి రోజూ పెద్దమందడి నుండి సైకిల్ పై వచ్చి పుల్యా తండాలో ఇంటింటికి తిరిగి నాతోపాటు తాండ బాల బాలికలను పాఠశాలకు తీసుకొని పోయేవాడు. చెట్లల్లో గుట్టల్లో పశువులతో తిరుగుతూ ఇలాంటి వ్యక్తిగత శుభ్రత క్రమశిక్షణ లేని నాకు పాఠశాల బాటలు నేర్పిన మహనీయుడు అని వారు గుర్తు చేశారు. నాలుగవ తరగతి తర్వాత బీసీ హాస్టల్లో సీటు రాకుంటే ఎనిమిది నెలలు తన ఇంట్లో పెట్టు కొని నన్ను పాఠశాలకు పంపిన గొప్ప వ్యక్తి అని వారు కొనియాడారు. మా గురువు చంద్రయ్య మా తాండ పాఠశాలకు వచ్చి మా తలరాతలు మార్చే శారని లేకుంటే నేను నిరక్షరాస్యునిగా పాలమూరు వలసవాది బిడ్డగా మిగిలిపోయే వాడినని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాకు విద్యాబుద్ధులు నేర్పిన నా గురువు అయిన చంద్రయ్య ను సన్మానించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని వారు తెలిపారు. తల్లిదండ్రి తర్వాత కనిపించే దేవుడు ఏకైక వ్యక్తి విద్యాభ్యాసాలు నేర్పి గురువు అని వారు సంతోషం వ్యక్తం చేశారు. నా గురువు చంద్రయ్య నేర్పిన విద్యాబుద్ధుల వాళ్ళని నేను నేడు చిట్యాల పా ఠశాలలో లైబ్రేరియన్ ఉద్యోగం పొందానని అలాగే ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫార్మసీలో డాక్టర్ సర్టిఫికెట్ పొందడానికి కృషి చేసిన ఏకైక వ్యక్తి మా గురువు చంద్రయ్య అలాంటి గొప్ప వ్యక్తికి పాదాభి వందనాలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు.



## ఓబీసీలకు,రాజ్యాధికారంలో సముచిత స్థానమివ్వరా?

**వరంగల్ తెలంగాణ ముచ్చట్లు:**

ఎంపీ రవిచంద్ర శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నాయకులు మధుసూదనాచారి, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పురుషోత్తమ రావు తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరు.ఎన్నికలప్పుడు తమ ఓబీసీల ఓట్లయితే కావాలి కానీ రాజ్యాధికారంలో సముచిత స్థానం ఎందుకు కల్పించడం లేదంటూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పాలకులను నిలదీశారు.దేశ జనాభాలో తాము 60శాతానికి పైగా ఉన్నా కూడా అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామ ని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంపీ రవిచంద్ర ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం ఓబీసీ ఇంటెలెక్చు వల్స్ ఫోరం వ్యవస్థాపకులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ఆధ్వర్యాన జరిగిన మహాధర్నాకు శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే పుట్టా మధుకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్దార్ పుటం పురుషోత్తమ రావు తది తరులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఓబీ సీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి, దేశవ్యాప్తంగా కులగణనను వెంటనే చేప ట్టాలి, చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్స్ కల్పించా లంటూ ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏండ్లు గడిచినా కూడా ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమన్నారు.ప్రధా నమంత్రి నరేంద్రమోడీ ఓబీసీకి చెందిన వారైనప్పటికీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఓబీసీల న్యాయమైన హక్కుల సాధనకు, వాటా దక్కించుకునేందుకు పార్లమెంట్ లోపల, బయట బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తు న్నదని ఎంపీ రవిచంద్ర చెప్పారు.మన న్యాయమైన హక్కుల సాధనకు ఈ జంతర్ మంతర్ వద్ద బడుగుల లింగయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్,బీద మస్తాన్ రావు తదితర ప్రముఖులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని పలు మార్లు గట్టిగా డిమాండ్ చేశామన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో బీసీలకు సముచిత ప్రాధాన్యత లభిం చిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.కేసీఆర్ బీసీలు,రైతు లు, బడుగు బలహీన వర్గాలు, మైనారిటీల పక్షపాతి అని,ఆయన హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని ఆయన వివరించారు.రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో బీసీలు ఇద్దరు మాత్రమే ఉన్నార ని,ఖాళీగా ఉన్న 6 స్థానాల భర్తీ సందర్భంగా తమకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని ఆయన కోరారు.దేశ వ్యాప్తంగా కులగణనను వెంటనే చేపట్టి పార్లమెం టులో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా చట్టసభల్లో తమకు 33%రిజర్వేషన్స్ కల్పిస్తూ మహిళలతో పాటు అమలుపర్చాలని ప్రధాని మోడీని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.రాజ్యాధికారంలో తమ ఓబీసీలకు న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ దేశవ్యాప్తం గా గొంతెత్తి నినదిస్తూనే ఉంటుందని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు సిద్ధేశ్వర్,కిరణ్,వేల్పుల శ్రీనివాస్,పర్వతం సతీష్, అరుణ,చామకూరి రాజు,డీ.వేలాద్రి,కే.వీ.గౌడ్ తది తరులతో కలిసి వందలాది మంది పాల్గొన్నారు.

"జై బీసీ జైజై బీసీ","ఏర్పాటు చేయాలి ఏర్పాటు చేయాలి కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి","చేపట్టాలి చేపట్టాలి కులగణనను దేశవ్యాప్తంగా వెంటనే చేపట్టాలి","ప్రవేశపెట్టాలి ప్రవే శపెట్టాలి పార్లమెంటులో ఓబీసీ రిజర్వేషన్స్ బిల్లును ప్రవేశపెట్టాలి","వర్ధిల్లాల్లి వర్ధిల్లాల్లి ఓబీసీల ఐక్యత వర్ధిల్లాలి","పోరాడుదాం పోరాడుదాం న్యాయమైన హక్కుల సాధనకు, వాటా దక్కించుకునేందుకు పో రాడుదాం"అనే నినాదాలతో జంతర్ మంతర్ పరిస రాలు దద్దరిల్లాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# రైతన్నల సమస్య పై తక్షణమే స్పందించిన మాజీ ఎంపీ నామ

- యేరుగట్ల రైతుల పక్షాన ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామ లేఖ
- జాప్యం లేకుండా యేరుగట్ల రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి - మాజీ ఎంపీ నామ
- నామ లేఖకు సానుకూలంగా స్పందించి ధాన్యం కొనుగులు చేస్తామని తెలిపిన అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి శ్రీనివాస్ రెడ్డి





**ఉమ్మడి ఖమ్మం , తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం యేరుగట్ల గ్రామ రైతులు ధాన్యం కొనుగోలు విషయంలో ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు డిసెంబర్,9 సోమవారం నాడు లేఖ రాశారు. ధాన్యం కొనుగోలు విషయం లో గత మూడు వారాలుగా రైతులు అధికారులను సంప్రదించినప్పటికీ, ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం లభించలేదని లేఖలో తెలిపారు. గతంలో గ్రామంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండగా, ఈ సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో కొత్త ప్రదేశంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఆర్థిక భారంగా మారిందని వివరించారు. ధాన్యాన్ని తరలించడానికి రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుందని, ఇది రైతులపై ఆర్థిక భారం పడుతుందని రైతులు తెలియజేసారని నామ తెలిపారు. జిల్లాలో ఇతర ప్రాంతాల్లో రైతుల నిల్వ వద్ద నుంచే ధాన్యం కొనుగోలు జరుగుతుండగా, యేరుగట్ల రైతులకు మాత్రమే కొత్త విధానం అమలు చేయడం అన్యాయం అని పేర్కొన్నారు. ఇటీవల తుఫాను ప్రభావంతో చిరుజల్లులు పడటం వలన ధాన్యం తడిచి పాడైపోయే అవకాశం ఉందని మాజీ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలగకుండా యేరుగట్ల గ్రామంలోనే ధాన్యం నిల్వ ఉన్న ప్రదేశం వద్ద నుంచే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా వారి సంక్షేమం దృష్టి లో పెట్టుకొని వెంటనే తగు చర్యలను తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. మాజీ ఎంపీ నామ రాసిన లేఖకు స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి (రెవిన్యూ) రైతుల నుండి ధాన్యం కొనుగులు చేస్తామని తెలిపారు. ఒక సామాన్య రైతు కుటుంబం లో జన్మించిన నామ నాగేశ్వరరావు రైతన్నకు కష్టం వచ్చింది అనగానే వెంటనే స్పందించారు. ఓడిన, గెలిచిన ఎప్పుడు ప్రజల పక్షాన వుండే నాయకుడు నామ నాగేశ్వరరావు అని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గ్రూప్ II పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో డిసెంబర్ 15 నుండి 16 వరకు జరిగే టీజీపీఎస్సీ గ్రూప్II పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.డిసెంబర్ 15 నుండి 16 వరకు 85 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్ II పరీక్షల సందర్భంగా డిసెంబర్ 15 ఉదయం 6:00 గంటల నుంచి డిసెంబర్ 16 సాయంత్రం 6:00 వరకు అంక్షాలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# గ్రూప్ 2 పరీక్ష నిర్వహణకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

గ్రూప్ 2 పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ అన్నారు.గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ గ్రూప్ 2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానం పై చీఫ్ సూపర్డెంట్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, డిపార్ట్మెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు మరియు బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 15 మరియు 16 తేదీలలో గ్రూప్ 2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 38 పరీక్షా కేంద్రాల్లో 13465 మంది అభ్యర్థులు గ్రూప్ టు పరీక్షకు హాజరుకానున్నారు అని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల 100% బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష హాల్లో ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్ పై ఇన్విజిలేటర్లు అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఓఎంఆర్ షీట్ లో అత్యంత జాగ్రత్తగా అభ్యర్థులు వారి వివరాలను కేటాయించిన ఆయా బ్లాకుల్లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు పనితీరును సరి చూసుకోవాలన్నారు.అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఐడి కార్డును తప్పనిసరిగా సరి చూడాలన్నారు. ఉద్దేశించిన రూట్ లో మాత్రమే ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ పత్రాలు తీసుకువెళ్లాలని, పోలీస్ బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, రూట్ అధికారులు, అబ్జర్వర్లు,ఐడెంటిఫికేషన్ అధికారులు, సంబంధిత శాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఐ డి ఓ సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9392919706 మరియు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటుచేసిన 04023542185,04023542187 టోల్ ఫ్రీ నెంబర్లకు ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలనికోరారు. ఈ అవగాహన సదస్సు లో గ్రూప్ 2 పరీక్షల కన్వీనర్ హరి కృష్ణ మరియు డీఎస్పీ ఏఆర్ సత్యనారాయణ (గ్రూప్ 2 పరీక్షల పోలీస్ నోడల్ అధికారి ) మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# భూమాత దరఖాస్తులను వెంటనే పరిష్కారించాలి

- ఖమ్మం అర్బన్ ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

భూమాత చట్టాన్ని (ధరణి) ఆమోదించి, ప్రజాపాలనలో వచ్చిన భూ దరఖాస్తులను విచారించి వాస్తవ సాగు దారులందరికీ పాసు పుస్తకాలివ్వాలి. ఇప్పటికే లక్షలాది మంది ఏడాది కాలంగా ఈ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాలు, సివిల్ కోర్టుల చుట్టూ చెప్పుల రిగేలా తిరుగుతున్నారు. కౌలుదారులకు హక్కులు కల్పించాలి. ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నందున ఈ పథకాల్ని ఆమోది ంచేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అలాగే ముసాయిదాలోని లోపాలను సరిచేయాలి. రాష్ట్రానికి వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి. భూసార పరీక్షలు నిర్వహించాలి. పంటల విధానాన్ని రూపొందించి రాష్ట్రాన్ని దిగుమతుల నుండి రక్షించాలి. నకిలీ విత్తన వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నకిలీ విత్తన వ్యాపారం సజావుగా సాగిపోతునేవుంది. రైతులు నష్ట పోతూనే ఉన్నారు. సంస్థాగతంగా, చట్టపరంగా చేపట్టాల్సిన చర్యలు శూన్యం.ప్రధానంగా ఆత్మహత్యల నివారణకు, కౌలుదారులకు చట్టపరమైన రక్షణ కల్పించాలి. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పనతో పాటు చట్టాల్లో మార్పు చేయాలి. 65 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి. రైతు బీమాలో మార్పు చేయాలి. జిల్లా స్థాయిలో అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటు చేసి రైతులెదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలి. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగంలోనే కాదు, ప్రజల్లోనూ విశ్వాసం కోల్పోతుంది ఈ ఈ సందర్భంగా జిల్లానాయకు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడాడు. కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ తెలంగాణ రైతు సంఘం నాయకులు ఎర్రబోయిన గోవిందరావు కూచిపూడి మధు సిఐటి రాష్ట్ర నాయకులు వై విక్రమ్, కళ్యాణ వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మీరా, ఏస్ కే పడగల్ నాగేశ్వరరావు రైతు సంఘం నాయకులు కే గౌస్మియా, తాటికొండ ను,శ్రీనివాసరావు కార్మిక సంఘం నాయకులు బత్తిని ఉపేందర్ జిల్లా కార్మిక సంఘ నాయకులు ముదాం శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు అనంతరం వినతిపత్రం డిప్యూటీ ఎమ్మార్వో కి సమర్పించనైనది




# ఎస్సీ వర్గీకరణతో అన్ని కులాలకు న్యాయం జరగాలి

- ఎస్సీ లోని 59 ఉప కులాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి
- జిల్లా యూనిట్ గా కల్పించే ఉద్యోగాలలో జిల్లా జనాభా దామషా ప్రకారమే రిజర్వేషన్ల శాతం అమలు చేయాలి
- విలేకరుల సమావేశంలో టిపిసిసి మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

వర్గీకరణతో ఎస్సీలోని అన్ని కులాలకు న్యాయం జరగాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ అన్నారు.ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ప్రతిష్టంగా అమలుపరిచేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ను ఏర్పాటుచేసి జిల్లాల వారీగా దళిత సంఘాలు, మేధావుల నుండి సలహాలు, సూచనలు స్వీకరించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర జనాభాలో ఎస్సీలోని 59 ఉప కులాలకు వారి జనాభా దామోషా ప్రకారం రిజర్వేషన్ శాతం కల్పించాలన్నారు. జిల్లా యూనిట్ గా నియమించే ఎటువంటి ఉద్యోగాలలోనైనా జిల్లాలోని ఆయా ఎస్సీ కులాల జనాభా దామషా ప్రకారం రిజర్వేషన్ల శాతం అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ప్రైవేటు రంగాలలో కూడా ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఎస్సీ అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలలో ఎస్సీ కులాలలో ఎక్కువ శాతం ఉన్నవారికి సీట్లు కేటాయించాలన్నారు. అదేవిధంగా నామినేటెడ్, దేవాలయ కమిటీలలో కూడా ఎస్సీ వర్గీకరణను పటిష్టంగా అమలుచేసే విధంగా చట్టం చేయాలని అన్నారు.

**"తెలంగాణ ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్ కు వినతి"**

ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎస్సీ వర్గీకరణపై అధ్యయన కోసం ఖమ్మం కు వచ్చిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్ కు పైన తెలిపిన వివిధ అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కస్తాల క్రాంతి కుమార్, ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ నాయకులు తోళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఉగాది నాటికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్తకి థియేటర్ రోడ్డులోని డివిజన్ 32, 36 లో రైల్వే నిధులు 3 కోట్ల 3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, కాలువలు, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పైప్ లైన్ నిర్మాణ పనులలో నాణ్యమైన సామాగ్రి వినియోగించాలని అన్నారు. డ్రైయిన్ లైన్ నేరుగా ఉండాలని, ఇక్కడ వేసే సిసి రోడ్లు పది కాలాల పాటు ఉండాలని మంత్రి ఆదేశించారు. పోల్ షిఫ్టింగ్, లైటింగ్ పూర్తయిన తరువాత సిసి రోడ్లు, డ్రైయిన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. పనులను 3 నెలలో పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్టర్ కు పనులు అప్పగించాలని, ఉగాది నాటికి వచ్చి చూస్తే పనులు పూర్తయి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహంలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పన

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఆహారం నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దు
- నయా బజార్ లోని వెనకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

వసతి గృహంలో ఉండి చదివే పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం నయా బజార్ లోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న స్టోర్ రూమ్, డార్మెటరీ లను కలెక్టర్ పరిశీలించారు. హస్టల్ కు వస్తున్న గుడ్లు, ఇతర సరకుల నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న డైట్ మెనూ, బెడ్స్ సౌకర్యం, తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహానికి ఉన్న అత్యవసర అంశాలపై నివేదిక అందించాలని వసతి గృహ వార్డెన్ సైదులు కు సూచించారు. 10 రోజులలో పూర్తి చేసే మరమ్మత్తులు, దోమల తెర, పెయింటింగ్ మొదలగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన బ్లాంకెట్, ఇతర పరికరాలు వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత లోపాలు ఎవైనా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది ఉండదని, వసతి గృహానికి వస్తున్న బియ్యం నాణ్యత అంశంలోనూ రాజీ పడవద్దని, నాణ్యమైన సరుకులు, బియ్యాన్ని మాత్రమే ఆమోదించి వాటిని వినియోగించి పిల్లలకు ఆహారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహంలోని విద్యార్థులకు బంకర్ బెడ్స్ అందించేందుకు టెండర్లు పిలవాలని, వెంటనే పిల్లలకు బ్లాంకెట్ లు అందించడం జరుగుతుందని అన్నారు.

ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు



# భూముల సర్వేపై కలెక్టర్ సమీక్ష

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం లోని ఇనుపరాతి గుట్ట పరిధిలో ఫారెస్ట్, పట్టా భూముల సర్వే పై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ఫారెస్ట్, పట్టాదారు భూముల సర్వే ఎంతవరకు వచ్చిందనే వివరాలను సర్వే, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఎఫ్ఓ లావణ్య, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, కుడా పివో అజిత్ రెడ్డి, ఫారెస్ట్, సర్వే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆదర్శవంతంగా నమూనా ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్*
- మేస్త్రీలకు అవసరమైన శిక్షణ ఇక్కడే అందించేందుకు ఏర్పాట్లు

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఆదర్శవంతంగా నమూనా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కూసుమంచి మండలం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇల్లు నిర్మించేందుకు గల అవకాశాలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇళ్ళు నిర్మించేందుకు మంచి స్థలం ఉండాలని అన్నారు.ప్రజలు వచ్చి ఇక్కడ నిర్మించిన ఇంటిని పరిశీలించి వారి స్థలాల్లో నిర్మించుకునేందుకు వీలుగా నమూనా ఇల్లు ఉండాలని అన్నారు.

మేస్త్రీలకు అవసరమైన శిక్షణ కూడా ఇదే ప్రాంతంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మోడల్ హౌస్ సంబంధించిన ఫ్లెక్సీలు ఇంటి శంకుస్థాపన బోర్డు పక్కనే ఏర్పాటు చేయాలని అన్నారు. లబ్దిదారుల ఎంపిక జరుగుతున్నదని, మరో నెల రోజుల తరువాత ఇండ్ల గ్రౌండింగ్ జరిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో కలెక్టర్ ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ నరసింహా రావు, స్పెషల్ ఆఫీసర్ శ్రీలత, ఇన్చార్జి తహసిల్దారు డి. కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, హౌజింగ్ ఇఇ శ్రీనివాసరావు, పీఆర్ ఇఇ వెంకట రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ర్యాగింగ్ కు దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి జిల్లా ప్రతినిధి, తెలంగాణ ముచ్చట్లు:

ర్యాగింగ్ అనేది తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని, విద్యార్థులు ఎవరు అటువంటి కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్ష్ సురభి, జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల చెప్పారు.

గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన జిల్లా యాంటీ ర్యాగింగ్ కమిటీ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యార్థుల జీవితాల్లో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని చెప్పారు. కాబట్టి ఎవరు ర్యాగింగ్ జోలికి పోకూడదని అన్నారు. మానసికంగానూ, శారీరకంగానూ జూనియర్లను గాని తోటి వారిని గాని వేధించడం రాగింగ్ కిందకి వస్తుందని, అటువంటి చర్యలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యవృత్తికి మంచి గౌరవం ఉంటుందని ఎవరు ర్యాగింగ్ వంటి వాటి జోలికి పోకుండా భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం వైద్య విద్యార్థుల కోసం ఎంతో వెచ్చిస్తుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ర్యాగింగ్ అనేది భవిష్యత్తును నాశనం చేస్తుందని, అందులో ఎవరు తలదూర్చావొద్దని చెప్పారు. కళాశాలలో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ కు గురైనట్లయితే వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా విద్యార్థులు తాము డిప్రెషన్ కు గురైనట్లు భావిస్తే 14416 టెలిమానస్ హెల్ప్ లైన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఎస్పీ గిరిధర్ రావుల మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడితే భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కాబట్టి ఎవరు ర్యాగింగ్ వంటి వాటిల్లో తలదూర్చవద్దని చెప్పారు. మంచి వారితోనే స్నేహం చేయాలని, చెడు ఉద్దేశాలు ఉన్నవారితో స్నేహం చేయవద్దని చెప్పారు. వైద్యవృత్తికి సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందని, ప్రతి బాగా చదివి సొసైటీకి మేలు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల్లో ఎవరు జోక్యం చేసుకోవద్దని సూచించారు.ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల వనపర్తి లో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆక్టివ్ గా ఉందని, ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ కు గురైతే కమిటీలో ఫిర్యాదు చేయడం ద్వారా ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అదేవిధంగా ప్రిన్సిపల్ పేషి లోను కంప్లైంట్ బాక్స్ ఉంచినట్లు చెప్పారు. అందరి వద్ద ప్రిన్సిపల్ మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న మహిళా శక్తి క్యాంటీన్ సందర్శించారు. మహిళా శక్తి ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న మహిళను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సునందిని, తాసిల్దార్ రమేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ రహదారుల విస్తీర్ణ పనులను వేగంగా పూర్తి చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:

వనపర్తి జిల్లా కేంద్రంలో రహదారులు భవనాల శాఖ పరిధిలోని పెండింగ్లో ఉన్న పనులను క్షేత్ర స్థాయికి వెళ్లి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి పరిశీలించారు. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ప్రసంగిస్తూ స్థానిక చింతల హనుమాన్ దేవాలయం దగ్గర రోడ్ల విస్తీర్ణ పనులలో భాగంగా పెండింగ్ లో ఉన్న రోడ్డును వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పానగల్ రోడ్లలో కూడా పెండింగ్ పనులను త్వరతీగతిన పూర్తి చేయాలని అన్నారు. స్థానికంగా ఉన్న ఆర్ అండ్ బి అతిథి గృహంలో కావలసిన ఏర్పాట్లు పూర్తి చేసి సంక్రాంతి పండుగ లోపు వాడుకలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆర్ అండ్ బి అతిధి గృహం ముందు కాంపౌండ్ వాల్ తో పాటు ముందు ఉన్న కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మించి సీసీ రోడ్డు కూడా వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. ఆర్అర్బి కార్య నిర్వహణ ఇంజనీర్ దే శ్య నాయక్. డిఈ సీతారాం స్వామి. వనపర్తి స్థానిక తహసిల్దార్ రమేష్ రెడ్డి. మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.





## కార్పోరేషన్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- పారిశుధ్య సమస్యలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి
- మంచి నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- వర్షా కాలం కంటే ముందు ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి కావాలి
- మునిసిపల్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఖమ్మం నగర పరిధిలో కార్పోరేషన్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పోరేషన్ లో విలీనమైన పంచాయతీలలో కార్మికుల కొరత, త్రాగు నీటి సమస్యలు, ఫాగింగ్ యంత్రాలు, పనిముట్లు లేవని క్షేత్ర స్థాయి నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మొదటి ప్రాధాన్యతగా పనిముట్లు, ఫాగింగ్ యంత్రాలు కొత్తవి కొనుగోలు చేసి సంబంధిత విలీన ప్రాంతాలకు సరఫరా చేయాలని మంత్రి అన్నారు. ప్రతి డివిజన్ కు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ లు తయారు చేసి సంబంధిత డివిజన్ ఇంజనీర్ అధికారులు, డివిజన్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, ప్రజలు ఉండేలా చూడాలని అన్నారు. పారిశుధ్య సిబ్బంది కొరత ఉందని, అటెండెన్స్ తప్పుగా నమోదు అవుతుందని, నీటి లీకేజీ సమస్యలు వేగంగా పరిష్కారం కావడం లేదని మంత్రి అన్నారు. నగరంలో విద్యుత్ కనెక్షన్లు సంబంధించి దరఖాస్తులు వెంటనే డిస్పోజ్ చేయాలని, అనర్హత ఉంటే వెంటనే ఆ దరఖాస్తుదారు లకు తెలియజేయాలని అన్నారు. పార్కు, జంక్షన్ ల నిర్వహణ సరిగ్గా లేదని, దీనిని మరింత మెరుగ్గా నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని మంత్రి అన్నారు. కుక్కల జనాభా నియంత్రణ ఆపరేషన్ లక్ష్యాలను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ సంస్థల్లో కూడా మొక్కల పెంపకం పర్యవేక్షించాలని అన్నారు.ప్రైవేట్ స్థలాల్లో ఫెన్సింగ్ వేసుకోవాలని, అక్కడ చెత్త చేరడానికి వీలు లేదని, రెండు, మూడు సార్లు నోటిసు ఇచ్చిన తరువాత కూడా యాజమాన్యుల నుంచి స్పందన రాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, నగరంలో ప్రభుత్వ సంస్థల్లో ముందస్తుగా ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని, ప్రైవేట్ సంస్థల్లో కూడా ఇంకుడు గుంతల నిర్మాణం జరిగేలా చూడాలని మంత్రి ఆదేశించారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అన్నారు. స్లాటర్ హౌస్ కు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని మంత్రి ఆర్డీవో ను ఆదేశించారు. ఖమ్మంలో త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు రావద్దని, కొత్తగా త్రాగునీటి కోసం ఏ పనులు చేపట్టాలి, అమృత్ క్రింద ఎలా చేపట్టాలి వివరాలతో నివేదిక అందించాలని అన్నారు.ప్రతి డివిజన్ పరిధిలో పారిశుధ్య, త్రాగు నీరు పరిశీలించి రోజు రిపోర్ట్ అందించేలా అబ్జర్వర్లను నియమించుకోవాలని మంత్రి మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా బల్క్ నీటి సరఫరా అందించే ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థల వివరాలు అందించాలని అన్నారు. వర్షా కాలం వచ్చే లోపు నగరంలో వరదల నియంత్రణకు చేపట్టాల్సిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్లను ఆక్రమిస్తూ ర్యాంపుల నిర్మాణం జరుగుతుంటే సిబ్బంది సైలెంట్ గా ఉండటం ఏంటని మంత్రి ప్రశ్నించారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణం జరిగే ర్యాంపులను వెంటనే తొలగించాలని మంత్రి ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్ హాల్స్, వైన్ షాపుల ముందు వాహనాల పార్కింగ్ విపరీతంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీటిని పరిష్కరించాలని అన్నారు. గంజాయి విక్రయాలు చేసే వారిపై పి.డి యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. మన నగరానికి ఎట్టి పరిస్థితుల్లో గంజాయి, మాధక ద్రవ్యాల సరఫరా రావడానికి వీలు లేదని, యువత భవిష్యత్తు దృష్ట్యా అత్యంత ప్రాధాన్యత అంశంగా డ్రగ్స్ అంశాన్ని పరిశీలించాలని అన్నారు. రాబోయే వర్షాకాలం కంటే ముందు రాజమండ్రి రహదారి పూర్తి కావాలని, దీని కోసం ధంసలాపురం ఫ్లై ఓవర్ తో సహా పూర్తి కావాలని అన్నారు. సమీక్ష లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని అన్నారు. పారిశుధ్య సిబ్బంది అటెండెన్స్ కు క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చర్యలు చేపట్టామని, ప్రతి వాహనాన్ని జిపిఎస్ ట్రాకర్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నామని అన్నారు. ప్రతి డివిజన్ అధికారి పరిధిలో నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త వేర్వేరుగా వచ్చే విధంగా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. పారిశుధ్య సిబ్బంది కేటాయింపు ప్రతి డివిజన్ కు ఒకే విధానంలో కాకుండా శాస్త్రీయ పద్ధతిలో చేస్తున్నామని అన్నారు. డివిజన్ ప్రతి స్ట్రెచ్ కు పారిశుధ్య సిబ్బంది విధులను పక్కాగా కేటాయించి, పారిశుధ్య ప్రణాళిక అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. డివిజన్ లో ఎటువంటి చెత్త వస్తుంది గమనించి పారిశుధ్య ప్రొఫైల్ ప్రతి డివిజన్ కు తయారు చేస్తున్నామని అన్నారు. నగరం కార్పొరేషన్ పరిధిలో జ్యూస్ షాపులు, హోటల్స్, నాన్ వెజ్ దుకాణాలు, ఫంక్షన్ హాల్స్, మొదలగు వాణిజ్య కార్యకలాపాలు ఎక్కడ జరుగుతున్నాయి, అక్కడి నుంచి ఎటువంటి చెత్త వస్తుంది, రోడ్డుపైన ఆ చెత్త పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి డివిజన్ లో అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలను హాట్ స్పాట్ లకు జియో ట్యాగ్ చేసి, ప్రతి నెలా కార్పొరేషన్ పరిధిలో హాట్ స్పాట్ లను పూర్తి స్థాయిలో శుభ్రం చేసి, అక్కడ ముందు ఎలా ఉంది, తరువాత ఎలా ఉందో ఫోటోలు పెడ్తున్నామని కలెక్టర్ తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త సెగ్రిగేషన్ పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ బ్యాన్ అమలు ప్రణాళిక ప్రకారం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రతి డివిజన్ కు పారిశుధ్య ప్రణాళిక తయారు చేశామని, ప్రతి డివిజన్ సంబంధించిన వాటర్ మ్యాన్, లైన్ మ్యాన్, పారిశుధ్య సిబ్బంది వివరాలు సంబంధిత ప్రజలకు తెలిసే విధంగా గోడలపై రాశామని, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించామని, పారిశుధ్య వాహనాల్లో జిపిఎస్ ఏర్పాటు చేసి ఆ వాహనాల మూమెంట్ ను మానిటరింగ్ చేస్తున్నామని అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుధ్య కంట్రోల్ రూమ్ శుక్రవారం నుంచి ప్రారంభిస్తామని, పారిశుధ్య కార్మికులకు షూస్, మొదలగు సేఫ్టీ మేటిరియల్ సరఫరా చేశామని, పోస్టాఫీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య సిబ్బంది జీవిత బీమా కల్పనకు చర్యలు చేపట్టామని, పారిశుధ్య సిబ్బంది ఆరోగ్య సమస్యల నిమిత్తం 5 లక్షల రూపాయల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేశామని అన్నారు.యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రతి రోజూ 15 నుంచి 20 ఆపరేషన్లు చేస్తున్నామని, కోతులు, పందుల సమస్య పరిష్కారం కోసం సంబంధిత ప్రైవేట్ ఏజెన్సీలతో సంప్రదింపులు జరుగుతున్నా యని, సమస్య ఉన్న వీధిలైట్ల రిప్లేస్మెంట్ కు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ సమావేశంలో డి.ఎఫ్.ఓ. సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కార్పొరేషన్ కార్పోరేటర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- డ్రైవర్లకు యోగా తరగతుల నిర్వహణకు చర్యలు
- ఆటో డ్రైవర్లకు చేపట్టిన ప్రత్యేక హెల్త్ క్యాంప్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించు కోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం ఆవరణలో ఆటో డ్రైవర్లకు జరుగుతున్న ప్రత్యేక హెల్త్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ లు ఒత్తిడి తగ్గించుకునేందుకు ఒక బ్యాచ్ యోగా తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, జనవరి లోపు వారానికి 3 యోగా క్లాస్ లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యోగా తరగతులలో నేర్చుకున్న అంశాలను ఆటో డ్రైవర్లు రెగ్యులర్ గా ఫాలో కావాలని అన్నారు.

ఆటో రిక్షా కార్మికులకు ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా 2 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, నగరంలో శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రం, నయా బజార్ హై స్కూల్ గ్రౌండ్, స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో వైద్య శిబిరాలు జరుగుతున్నాయని, ఆటో కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. వైద్య శిబిరాలలో ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉన్నందున, అవసరమైన వారికి చికిత్స చేయడం జరుగుతుందని అన్నారు. ఆటో డ్రైవర్లు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని అన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, కంటి పరీక్ష, ల్యాబ్, ఫార్మసీ, తదితర పరీక్షలు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.జిల్లా కలెక్టర్ వెంట ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కళావతి బాయి, డి.సి.హెచ్.ఎస్. డా. రాజశేఖర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## దరఖాస్తులన్నింటి శాస్త్రీయ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర ఎస్సి ఏక సభ్య కమీషన్ చైర్మన్ డా. షమీమ్ అక్తర్
- కలెక్టరేట్ లో బహిరంగ విచారణ చేపట్టిన ఎస్సి ఏకసభ్య కమీషన్ చైర్మన్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై స్వీకరించిన దరఖాస్తులన్నింటిని క్రోడీకరించి దానిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డా. షమీమ్ అక్తర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సి కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు.పలువురు షెడ్యూల్ కులాల సంఘాలు, వ్యక్తులు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ పై దరఖాస్తులను కమీషన్ కు సమర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, బహిరంగ విచారణలో స్వీకరించిన దరఖాస్తులు, అభిప్రాయాలు అన్నింటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. దరఖాస్తు సమర్పించే వారందరూ ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా సమర్పించాలని కోరారు. వీటన్నింటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని అన్నారు. ఇదివరకు రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాలలో బహిరంగ విచారణ నిర్వహించడం జరిగిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్ లో నేరుగా కమిషన్ కు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చని అన్నారు.షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ పై నిర్వహించిన బహిరంగ విచారణలో 450 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారు.అనంతరం చైర్మన్ ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామంలోని ఎస్సి కాలనీని సందర్శించి, అక్కడి ప్రజల స్థితిగతులను పరిశీలించారు. ఉపాధికి చేపడుతున్న పనుల గురించి, ప్రభుత్వం నుండి పొందుతున్న సహాయం గురించి, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం కలుగుతుందని చైర్మన్ తెలిపారు.అంతకుముందు ఎస్సి వర్గీకరణ పై బహిరంగ విచారణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఎస్సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డా. షమీమ్ అక్తర్ కు ఎన్ఎస్పీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి సంక్షేమ అధికారులు కె. సత్యనారాయణ, అనసూయ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి కార్పొరేషన్ ఇడిలు నవీన్ బాబు, ఉపేందర్ రావు, రాష్ట్ర కార్యాలయం సూపరింటిండెంట్ సజ్జన్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం 13–12–2024

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక





## నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల

# మొబైల్ యాప్ సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వే ను నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ మరియు నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాల పై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన లతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తు నమోదు చేపట్టాలని, నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఒకచోట నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నచో అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తులు యాప్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మండల మరియు గ్రామస్థాయిలో ఎన్ని దరఖాస్తులు ఉన్నవి నివేదికలు తయారు చేసుకొని ఎక్కువ దరఖాస్తులు ఉన్నచోట సర్వేకు అదనపు సిబ్బందిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం మరియు కొత్తగూడెం ఆర్డీవోలు ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలం గుర్తించి త్వరితగతిన మోడల్ హౌస్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 15,16 తేదీలలో గ్రూప్ టు పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు.ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ 1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష, అలాగే 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ 4 పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లాలో మొత్తం (13465) మంది అభ్యర్థులు (38) పరీక్ష కేంద్రాల్లో ఈ గ్రూప్2 పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్ లు (38), డిపార్ట్మెంటల్ అధికారులు (38), అబ్జర్వర్ లు (40), ఫ్లయింగ్ స్క్వాడ్ లు (12), బయోమెట్రిక్ అధికారులు (43), ఐడెంటిఫికేషన్ అధికారులు (134), ఆరు రూట్లలో ఆరుగురు లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, మౌలిక వసతులను కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్ లను పకడ్బందీగా, తగిన జాగ్రత్త చర్యల నడుమ తప్పనిసరిగా ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమయానుకూలంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, జిల్లా అధికారులు మరియు పంచాయతీ అధికారులు తమ పరిధిలోని హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలలు అన్ని రకాల పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. 40% డైట్ చార్జీలు పెంచినందున పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతి విద్యా సంస్థలు మెన్యు కు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని అన్నారు.



## నిర్వాసితులు ఇంటి నిర్మాణ

# పనులు వెంటనే ప్రారంభించాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- కాలనీలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు కృషి
- నగరంలోనే అత్యంత విలువైన ప్రాంతంగా రఘునాథపాలెం మండలం అభివృద్ధి


ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు, వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వారికి అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి గురువారం మంత్రి, రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వే 3వ లైన్ క్రింద పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు. నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన త్రాగు నీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు. యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు సమీపంలోనే నిర్మాణం అవుతున్నాయని, మీ పిల్లలు ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందించిన పరిహారం సద్వినియోగం చేసుకుంటూ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, ఇక్కడ సమీపంలోనే కలెక్టరేట్ ఉన్నదని, వైద్య కళాశాల, ఆసుపత్రి వస్తాయని, ఈ ప్రాంతం చాలా విలువ కలిగిన ప్రాంతం అవుతుందని అన్నారు. ఖమ్మం నగరంలోని నిరుపేదలకు ఇండ్లు ఇచ్చే బాధ్యత, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాల్లో ఇళ్లను కోల్పోయే వారికి సైతం నగరం చుట్టూ మంచి స్థలాల్లో చూసి ఇంటి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ‘హెచ్‌సిటీ’ వేగవంతానికి

# కార్యాచరణ సిద్ధం చేయాలి

హైదరబాద్ తెలంగాణ ముచ్చట్లు:



హెచ్‌సిటీ ప్రాజెక్ట్ పనులను వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారులకు సూచించారు. గురువారం ఎన్ఐయూఎంలో హెచ్‌సిటీలో భాగంగా రూ. 3500 కోట్లతో చేపట్టనున్న 38 రోడ్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు, రూ.150 కోట్లతో చేపట్టనున్న జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ పనులను వేగంగా ప్రారంభించి, పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ముఖ్య కార్యదర్శి దిశానిర్దేశం చేశారు.రూ.1230 కోట్లతో చేపట్టే కేబీఆర్ పార్క్ చుట్టూ ఆరు జంక్షన్లలో ఫ్లై ఓవర్లు అండర్‌పాస్‌ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. 125 ట్రాఫిక్ జంక్షన్లలో అడ్డుగా ఉన్న 4100 విద్యుత్ పోల్స్‌ను 3 నెలల్లోగా తరలించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టాలని దానకిశోర్ చెప్పారు. కాగా, విరించి జంక్షన్,పెన్షన్ ఆఫీస్ లింక్ రోడ్డును క్షేత్రస్థాయిలో బల్దియా కమిషనర్ ఇలంబర్తి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్‌తో కలిసి దానకిశోర్ పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు విరించి రోడ్డు వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధితో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

వర్ధన్నపేట తెలంగాణ ముచ్చట్లు



వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన జెట్టబోయిన వెంకటయ్య తాపీ మేస్త్రి మరియు మత్స్యకారుడు గా జీవనం గడుపుతు ఆర్థిక ఇబ్బందులతో సోమవారం పురుగుల మందు తాగగా వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజిఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు.



## పట్టణ నడిబొడ్డున

# ఉన్న రైస్ మిల్లులను తరలించండి

- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రైస్ మిల్లులను పట్టణ నడిబొడ్డున ఉండి... ప్రజల ఆరోగ్యాలు, ప్రాణాలకు హాని చేస్తున్నందున మిల్లులను తరలించి ప్రజలను కాపాడాలని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ అన్నారు. ఈ సమస్యల పైన జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే దృష్టి సారించాలని విన్నవించారు.నాలుగవ వార్డ్ లోకనాథ్ రెడ్డి మిల్లు, 22వ వార్డు ఫరీద్ మిల్లు, 28వ వార్డు సత్యనారాయణ మిల్ , 30 వార్డ్ నాగేందర్ మిల్లు, 31 వ వార్డు ప్రతాప్ రెడ్డి మిల్లు, ఊరి నడిబొడ్డిన ఉన్నాయి. వీటిపై చాలా రోజులుగా ప్రజలు పలు విధాలుగా ఫిర్యాదు చేస్తూ, మిల్లులను తొలగించాలని ప్రజావాణి ద్వారా, ఐక్యవేదిక ద్వారా విన్నపాలు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలేదనీ, ఈరోజు ప్రజలు మళ్లీ ఐక్యవేదికను ఆశ్రయించిన వెంటనే పలు మిల్లులను పరిశీలించిన ఐక్యవేదిక నాయకులు, ప్రతి మిల్లు దగ్గర రోడ్డుపై వెళ్తున్న పాదచారుల, వాహనదారుల కళ్ళల్లో దుమ్ము పడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే ఈ మిల్లుల ను ఊరి బయటకు పంపించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు కార్యక్రమం చేయడం జరిగింది. లేనియెడల దీనికి సంబంధించిన అధికారులపై వనపర్తికి వస్తున్న ముఖ్యమంత్రి గారికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఊరి నడిబొడ్డులో ఉండి ప్రతినిత్యం దుమ్ము వెలువరించే ఈ మిల్లులు ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్నాయని అలాగే ఈ మిల్లుల ద్వారా వచ్చే దుమ్ము దూళి ప్రజల ఇళ్లలోకి, ఇంటి పైకి పడి ప్రతిరోజు గృహినులకు ఇబ్బంది కలిగిస్తుందని ఈ సమస్య తీవ్రతను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు వెంటనే చర్యలు తీసుకోవాలనీ ప్రజలు అఖిలపక్ష ఐక్యవేదిక ద్వారా హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు,, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, బి.ఎస్.పి టౌన్ ప్రెసిడెంట్ గంధం భరత్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శరత్ చంద్ర, మరియు 4, 22, 28, 30 ,31 వాడు ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు విద్యార్థులు

# నిర్విరామంగా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఉమ్మడి ఖమ్మం ,తెలంగాణ ముచ్చట్లు:





నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం నయాబజార్ జూనియర్ కళాశాల కాంప్లెక్స్ లో రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు అందించిన వరద సహాయక కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరదల్లో సర్వసం కోల్పోయిన విద్యా సంస్థలకు 3 లక్షల 87 వేల 600 రూపాయలతో చేసిన ప్రహరీ గోడల నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మత్తులు, ల్యాబ్ నెలకొల్పుట, కోల్పోయిన ఫర్నిచర్ తిరిగి ఆయా సంస్థలకు అందించుట, వంట సామాన్లు, డ్యూయల్ డెస్క్ లు అందించుట వంటి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్, రోటరీ క్లబ్ గవర్నర్ కే. శరత్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో 20 ఫీట్ల వరద వస్తే ఈ సంవత్సరం 40 ఫీట్ల వరద వచ్చిందని, ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాలంటీర్ లు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, స్వచ్ఛందంగా వచ్చి పని చేశారని అన్నారు. ఖమ్మం జిల్లాలో పని చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న ఖమ్మంను విడతల వారీగా బాగు చేసుకుంటున్నామని అన్నారు. వరదల సమయానికి ఉన్న పరిస్థితి నుండి నేడు పాఠశాలను తీర్చిదిద్దినందుకు రోటరి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. స్వార్థంతో కాకుండా మా ఖమ్మం, మా పిల్లలు అని నమ్మి పని చేసినందుకు మనమంతా అద్భుతమైన స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలుగా పెద్ద ఆలోచనలను పెట్టుకోవాలని, దాని సాధన కోసం ప్రతి రోజూ కొంత శ్రమ చేయాలని, ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో కూడా మన లక్ష్యాలను మర్చిపోవద్దని అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తరువాత మనతో పాటు మరో నలుగురిని బాగు చేసే దిశగా పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ జిల్లా గవర్నర్ కే. శరత్ చౌదరి మాట్లాడుతూ రోటరీ అనే సంస్థ ప్రపంచవ్యాప్తంగా పోలియో వ్యాక్సిన్ కోసం 19 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని అన్నారు. ప్రపంచంలో పోలియో లేకుండా చేసేందుకు రోటరీ పని చేస్తుందని అన్నారు. రోటరీ నిమ్స్ సమన్వయంతో 900 మంది పిల్లలకు హార్ట్ ఆపరేషన్స్ జరిగాయని, మరో సంస్థతో సమన్వయం చేసుకుంటూ 1100 మంది పిల్లలకు ఆపరేషన్లు చేయించామని అన్నారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకొని సమాజం కోసం మంచి పనులు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మల్లాది వాసుదేవ్, పి. సాంబ శివరావు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు విసిరెడ్డి బాల కోటి రెడ్డి, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్2 పరీక్షల

# నిర్వహణపై అధికారులకు కీలక సూచనలు

హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:

హనుమకొండ జిల్లాలో గ్రూప్2 పరీక్షల నిర్వహణకు సంబంధించి అధికారులు విధులను కచ్చితంగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు.హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్ మరియు ఫోటో గుర్తింపు సక్రమంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన నియమాలు, మార్గదర్శకాలు విపులంగా వివరించారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవి, పరీక్షల రీజినల్ కోఆర్డినేటర్లు సదానందం, ఆనంద్ కిషోర్, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వేడుకగా నటి కీర్తి సురేష్ వివాహం



నటి కీర్తిసురేష్ వివాహం ఘనంగా జరిగింది. చివరి వరకూ పెళ్లి విషయంలో సస్పెన్స్ మెయింటెన్ చేసిన కీర్తి పది రోజులు ముందుగానే పెళ్లి విషయం చెప్పి అభిమానుల్ని సర్ ప్రైజ్ చేసింది. అప్పటి నుంచి కీర్తి సురేష్ ని పెళ్లి కూతురు దుస్తుల్లో ఎప్పుడు చూస్తామా? అన్న ఎగ్జైట్ మెంట్ అందరిలోనూ పెరిగిపోతుంది. తాజాగా ఆ పెళ్లి ఘట్టానికి సంబం-ధించిన ఫోటోలను స్వయంగా తానే సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.తన లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోని తట్టిల్‌ను వివాహం చేసుకుంది కీర్తి. నేడు గురువారం గోవా వేదికగా హిందూ సంప్రదాయంలో ఈ వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం పెళ్లి ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కీర్తి సురేష్ పసుపు, గ్రీన్ కలర్ కాంబినేషన్ చీర..రవిక ధరించింది. నుదిటిన బాసికం..పాపిడి బొట్టు..మెడలో పూల మాలలు....తలలో మల్లెపువ్వులు ధరించి ఎంతో అందంగా ముస్తాబైంది. కొత్త పెళ్లి కూతురు కళ్లద్దాలతో ఫోజులి వ్వడం ఇప్పుడు ట్రెండ్ గామారింది. ఆ రకమైన బ్లాక్ గ్లాసెస్ ని కీర్తి కళ్లకు ధరించింది. ఇక పెళ్లి కొడుకు కీర్తి మెడలో మూడు ముళ్లు వేస్తోన్న దృశ్యం చూడొచ్చు. ఆ సమయంలో కీర్తి భర్త వైపు చూస్తూ ఎంతో సంతోష పడుతుంది.మూడు ముళ్లు వేసిన అనంతరం భర్త ఆంటోనీ తట్టల్ కీర్తి నుదిటిన ప్రేమతో ముద్దాడా-రు. పెళ్లి కూతురు..పెళ్లి కొడు కులను పక్క పక్కనే కూర్చోబెట్టి పంతులు పెళ్లి క్రతవుకు సంబంధించిన పూజలు చేయించడం చూడొచ్చు. ఇక వివాహం అనంతరం కొత్త జంట మధ్యలోకి కీర్తి అమితంగా ఇష్టపడే మూగ జీవి కుక్క పిల్లను చూడొచ్చు. దంపతు లిద్దరు ఆ కుక్క పిల్లను ముద్దాడుతు ఫోటోలు దిగారు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అలాగే కీర్తి- అంటోనీ క్రైస్తవమత ప్రకారం కూడా పెళ్లి చేసుకోవాల్సి ఉంది. ఆ పెళ్లి ఈరోజు సాయంత్రం ఓ చర్చి లో జరుగు తుందని తెలుస్తుంది

# దేవియాని శర్మ

# బికినీలో జలకన్య లాంటి అందం



దేవియాని శర్మ.. గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటూ తరచుగా వార్తల్లో నిలుస్తోంది. ఇక లేటెస్ట్ గా అమ్మడు గోవా బీచ్‌లో బికినీ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఎరుపు రంగు బికినీ ధరించి, సూర్యకిరణాల్లో మెరిసిపోతూ బీచ్ సైడ్‌లో తీర్చిదిద్దుకున్న ఫోటోలు నెటిజన్ల మనసులను దోచేశాయి.సాండ్ టోస్ అండ్ సన్-కిస్డ్ నోస్ అని క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోస్, ఆమె ఫ్యాషన్ స్టేట్మెంట్‌ను మరింత ఎత్తుకి తీసుకెళ్లాయి. దేవియాని తన కాన్ఫిడెన్స్‌తో, ఈ బీచ్ లుక్స్‌లో తన గ్లామర్‌తో ట్రెండ్‌ను సెట్ చేయడం వర్ణనాతీతం. బికినిలో జలకన్య లాంటి అందం అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. దేవియాని కెరీర్ విషయానికి వస్తే, ఆమె మొదట మోడలింగ్ రంగంలో ప్రవేశించి తన ప్రత్యేకతను చాటుకుంది."అనగనగా," "సైతాన్," "సేవ్ ది టైగర్స్" వంటి వెబ్ సిరీస్‌లతో తన టాలెంట్‌ను ప్రదర్శిస్తూ ప్రేక్షకులలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. నటన గ్లామర్ పరంగా ఆమెకు వెబ్ సిరీస్‌లలో మంచి గుర్తింపు తెచ్చాయి. ప్రస్తుతం "లైఫ్ స్టోరీస్" అనే వెబ్ సిరీస్‌లో నటిస్తూ తన పాత్రకు పూర్తి న్యాయం చేస్తోంది. కెరీర్‌ను పదేపదే కొత్త దిశగా నడిపిస్తూ, వెబ్ సిరీస్‌లలో ఆమె తన ప్రతిభను నిరూపించుకుంటోంది. గతంలో కూడా దేవియాని తన బికినీ లుక్స్‌తో సోషల్ మీడియా హీట్ పెంచిన సందర్భాలు ఉన్నాయి. ప్రతీసారి ఓ కొత్త ఫోటోషూట్ ద్వారా అభిమానులను ఆశ్చర్యపరుస్తున్న ఆమె, ఈసారి ఎరుపు రంగు బికినీతో కొత్త ట్రెండ్ సృష్టించింది. బీచ్ సైడ్‌లో కూర్చుని తీసిన ఫోటోలు ఆమె నేచురల్ బ్యూటీని హైలైట్ చేశాయి. దేవియాని శర్మ తన ఫోటో షూట్లతో మాత్రమే కాకుండా, తన ఫిట్‌నెస్‌ను కూడా స్పష్టంగా ప్రదర్శిస్తోంది. నెటిజన్ల నుంచి పాజిటివ్ రివ్యూస్‌ను పొందుతూ, ఆమె సోషల్ మీడియాలో తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది.

## sports స్పోర్ట్స్



# ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేత గుకేశ్

యువ కెరటం దొమ్మరాజు గుకేశ్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరిగిన తుది పోరులో విజేతగా నిలిచాడు. గురువారం జరిగిన 14వ రౌండ్‌లో నువ్వా? నేనా? అన్నట్లుగా సాగిన గేమ్‌లో చివరికి విజయం గుకేశ్‌నే వరించింది. విశ్వనాథన్ ఆనంద్ (5 సార్లు) తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్న రెండో భారత ఆటగాడిగా గుకేశ్ చరిత్ర సృష్టించాడు.ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన అతిపిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు సృష్టించాడు. 18 ఏళ్ల వయస్సులో 18వ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. 2012 తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్న తొలి భారతీయుడు గుకేశ్. ఈ ఎత్తుల రారాజు తమిళనాడులోని తెలుగు కుటుంబానికి చెందినవాడేనిజానికి బుధవారమే ఈ ఫలితం తేలాల్సింది. అయితే.. సుమారు 5 గంటలపాటు సాగిన 13వ రౌండ్‌లో ప్రత్యర్థులిద్దరూ పాయింట్‌ను పంచుకున్నారు. విజయం కోసం 18 ఏళ్ల గుకేశ్ గట్టిగానే ప్రయత్నించినా.. ప్రశాంతంగా ఆడిన 32 ఏళ్ల లిరెన్ ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో 68 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు ఫలితం తేలకుండానే గేమ్ ముగించేందుకు అంగీకరించారు. దీంతో చెరో 6.5 పాయింట్లతో మ్యాచ్ డ్రా అయ్యింది. ఇవాళ జరిగిన 14వ రౌండ్‌లో విజయంతో ఒక పాయింట్ సాధించిన గుకేశ్ 7.5తో విజేతగా నిలిచాడు. మొత్తం 14 గేమ్‌లలో గుకేశ్- 3, లిరెన్- 2 గేమ్‌లలో విజయం సాధించగా.. తొమ్మిది గేమ్‌లు డ్రాగా ముగిశాయి.చెస్ ప్రపంచం దృష్టిలో.. మంచి ఫామ్‌లో ఉన్న 18 ఏళ్ల గుకేశ్ ఫేవరెట్. అతడు.. నెపోమ్నియాషి, కరువానా, నకముర వంటి మేటి గ్రాండ్‌మాస్టర్‌స్‌ను తోసిరాజని క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా లిరెన్‌తో పోరుకు అర్హత సాధించి, ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చెస్ ఒలింపియాడ్‌లో భారత్ తొలిసారి స్వర్ణం గెలవడంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. తనలో ఛాంపియనయ్యే లక్షణాలు ఉన్నాయని ఇప్పటికే చాటుకున్నాడు



# అరుదైన రికార్డుకు ఒక్క సెంచరీ దూరంలో కోహ్లీ..

## ఒక్కటే ఆడాడు

గబ్బా స్టేడియంలో కోహ్లీ ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఆ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగులు చేసి హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగుకే మిచెల్ జాన్సన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

ప్రస్తుతం బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో విరాట్ కోహ్లీ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకుంటే అతను మాత్రం ఉసురుమనిపిస్తున్నాడు. పెర్త్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టినా, మిగతా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు. ఆఫ్ స్టంప్ మీద పడిన బంతిని వెంటాడుతూ వికెట్ల వెనుకే క్యాచ్ ఔటవుతున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై తిరుగులేని రికార్డున్న విరాట్.. ఆ బలహీనతను అధిగమించి మునుపటి ఫామ్‌ను అందుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. 36 ఏళ్ల ఈ స్టార్ బ్యాటర్‌కు బహుశా ఇదే చివరి ఆసీస్ పర్యటన కావొచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సచిన్ తెందూల్కర్ కూడా సాధించలేకపోయినా ఓ అరుదైన ప్రపంచ రికార్డు ఇప్పుడు విరాట్‌ను ఊరిస్తోంది. ఇప్పుడు మిస్సయితే మళ్లీ ఆ ఛాన్స్ రాకపోవచ్చు. డిసెంబరు 14 నుంచి గబ్బా వేదికగా ఆసీస్‌తో జరగనున్న మూడో టెస్టు లో కోహ్లీ శతకం బాదితే అద్భుతమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంటాడు. ఆస్ట్రేలియాలోని ఐదు ప్రధాన స్టేడియాల్లో సెంచరీలు చేసిన మూడో విదేశీ ఆటగాడిగా నిలుస్తాడు. ఇప్పటివరకు భారత దిగ్గజం సునీల్ గావస్కర్, అలిస్టర్ కుక్ మాత్రమే ఈ ఫీట్ సాధించారు. గావస్కర్ 1977లో బ్రిస్బేన్, పెర్త్, మెల్‌బోర్న్.. 1985లో అడిలైడ్, సిడ్నీలో సెంచరీలు సాధించాడు. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ అలిస్టర్ కుక్ 2006లో పెర్త్ స్టేడియంలో, 201011లో బ్రిస్బేన్, అడిలైడ్, సిడ్నీ మైదానాల్లో శతకాలు బాదాడు. 2017లో కుక్ మెల్‌బోర్న్‌లో మూడంకెల స్కోరందుకుని గావస్కర్ సరసన నిలిచాడు. కోహ్లీ ఇప్పటివరకు టెస్టుల్లో ఏడు శతకాలు బాదాడు. అడిలైడ్‌లో మూడు సెంచరీలు (2012లో ఒకటి, 2014లో రెండు), పెర్త్‌లో రెండు సెంచరీలు (2018, 2024), మెల్‌బోర్న్‌లో (2014), సిడ్నీలో (2015)లో ఒక్కో శతకం సాధించాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in